సూర్య 19వ వసంతంలోకి ...
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

మంగళవారం | 28 అక్టోబర్ 2025 | విజయవాడ

సంపుటి 19 | సంచిక 7
| పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - వర్ష ఋతువు, బహుళ పక్షం, కార్తీక మాసం సప్తమి తె.4.02 వరకు, పూర్వాషాఢ మ.12.13, వర్జ్యం రా.8.38 నుంచి 10.20 వరకు
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు దుర్ముహూర్తం ఉ.8.15 నుంచి 9.03 వరకు తిరిగి రా. 10.35 నుంచి 11.24 వరకు

### లాభాల్లో స్టాక్

## మార్కెట్‌లు



5 లో

- సెన్సెక్స్ 567 పాయింట్స్ జంప్
- సెన్సెక్స్ 567 పాయింట్లు, నిఫ్టీ 170.90 పాయింట్ల లాభం
- 4044 డాలర్ల వద్ద కొనసాగిన ఔన్సు బంగారం

### 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్

## ప్రారంభిస్తున్నాం



6 లో

**ఎస్ఐఆర్ రెండోదశపై సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రకటన**

దేశంలో రెండో విడత సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్‌ను మంగళవారం నుంచి చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మొత్తం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రెండో విడత ఎస్ఐఆర్ చేపడతామని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెల్లడించారు.

### మొంథా తుఫాన్‌పై ప్రతీ గంటకూ

# బులిటెన్ విడుదల



- రియల్ టైమ్‌లో అప్‌డేట్స్
- ఆస్తి-ప్రాణ నష్టం నుంచి రక్షించడమే ప్రభుత్వ లక్ష్యం
- నిరంతర సమాచారానికి శాటిలైట్ ఫోన్లు, మొబైల్ టవర్ల ఏర్పాటు
- పునరావాస కేంద్రాల్లోని వారికి నిత్యావసరాల పంపిణీ
- సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- తుఫాన్‌పై ముఖ్యమంత్రితో ఫోన్లో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోడీ
- రాష్ట్రానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని భరోసా
- పీఎంఓతో సమన్వయ బాధ్యతలు మంత్రి లోకేష్‌కు అప్పగించిన సీఎం

### డిజిటల్

# అరెస్ట్

**అత్యంత భయంకరమైన ముప్పు**

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన
- ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము
- ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచన



6 లో

డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ..భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు.

## సుప్రీం తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

- కేంద్రానికి జస్టిస్ గవాయ్ సిఫార్సు
- నవంబర్ 24నే 53వ సీజేఐగా బాధ్యతలు



6 లో

## ఈశాన్య భారత రాష్ట్రాలతో బంగ్లాదేశ్ మ్యాప్

- ఇండియాపై విషం కక్కుతున్న యూనస్
- పాక్, బంగ్లా, చైనా దగ్గరవుతున్నాయంటూ కథనాలు



6 లో

### సీఎంకు పీఎం

# మోడీ ఫోన్



2 లో

- తుపాను ప్రభావంపై ఆరా
- ప్రధాని కార్యాలయంతో సమన్వయం
- లోకేష్‌కు కీలక బాధ్యతలు

తుఫాను నేపథ్యంలో ఏపీ సీఎం చంద్ర బాబుతో ప్రధాని మోదీ మాట్లాడారు. తుఫాను ప్రభావం, ముందు జాగ్రత్త చర్యలపై సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు రెడ్ అలర్ట్, రాయలసీమకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు.

### తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో

## అప్రమత్తంగా ఉండాలి

- సెలవుల్లో ఉన్న అధికారులు వెంటనే విధుల్లో చేరాలి
- చెరువులు, కాల్వ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేయాలి
- బుడమేరు డైవర్షన్ ఛానెల్‌పై నిరంతర నిఘా ఉండాలి
- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



3 లో

### మొంథా తుపానును ఎదుర్కొనేందుకు

# సిద్ధంగా ఉండండి

- ప్రభావిత ప్రాంతాల్లో యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉంచాలి
- ప్రాణ నష్టం సంభవించకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి
- పునరావాస కేంద్రాల్లో ఆహారం, రక్షిత తాగునీరు, పాలు, ఔషధాలు సిద్ధం చేసుకోవాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి నారాయణ వీడియో కాన్ఫరెన్స్



2 లో

మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని 12 మండలాల పరిధిలో తుపాను ప్రభావం ఉండనున్న క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ సందర్శన



3 లో

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలి
- లోతట్టు ప్రాంతాల ప్రజలు శిబిరాలకు చేరాలి

### తుఫాను ప్రభావిత 12 జిల్లాల్లో

## పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు

- రాష్ట్రంలో 14,145 రేషన్ డిపోలు ద్వారా 7 లక్షలు రేషన్ కార్డు కుటుంబాలకు నిత్యా వసర సరుకులు పంపిణీకి చర్యలు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి,జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

### మొంథా తుఫాన్

## 43 రైళ్లు రద్దు

- విశాఖ మీదుగా నడిచే పలు రైళ్లు రద్దు
- కొన్ని కీలకమైన రైళ్లు రద్దు
- తుఫాన్ తర్వాత పునరుద్ధరణ
- ఆంధ్ర వైపు దూసుకొస్తున్న తుఫాన్
- ప్రయాణికుల భద్రత దృష్ట్యా చర్యలు తీసుకున్న రైల్వే శాఖ



2 లో

### వీధి కుక్కల వ్యవహారం

# మీకు పట్టదా?

- పలు రాష్ట్రాలపై సుప్రీం కోర్టు సీరియస్
- చర్యల వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది
- తప్పుగా చిత్రీకరిస్తున్నారు అంటూ ధర్మాసనం ఆగ్రహం
- ఇప్పటికీ అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదని నిలదీత
- ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు తదుపరి విచారణకు హాజరు కావాలని సుప్రీం ధర్మాసనం ఆదేశం



6 లో

వీధి కుక్కల కేసు వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. వాటిని శిబిరాలకు తరలించడంపై తీసుకున్న చర్యలను తెలియజేస్తూ పలు రాష్ట్ర ప్రభుత్వాలు అఫిడవిట్లు దాఖలు చేయలేదు. దీనిపై న్యాయస్థానం సీరియస్ అయ్యింది. స్పందించని వివిధ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు తదుపరి విచారణకు తమ ముందు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది.



"వాస్తవికతతో జరిగే యుద్ధంలో ఊహ అత్యంత శక్తివంతమైన ఆయుధం."
- జూల్స్ డి గౌల్టియర్



"వైఫల్యం కంటే సందేహం ఎక్కువ కలలను చంపుతుంది."
- సుజీ కాస్సెం



"సృజనాత్మకత ఒక క్రూరమైన మనస్సు మరియు క్రమశిక్షణ గల కన్ను."
- డోరతీ పార్కర్

# మొంథా తుఫాన్‌పై ప్రతీ గంటకూ బులిటెన్ విడుదల

● రియల్ టైమ్‌లో అప్ డేట్స్ ● ఆస్తి-ప్రాణ నష్టం నుంచి రక్షించడమే ప్రభుత్వ లక్ష్యం ● నిరంతర సమాచారానికి శాటిలైట్ ఫోన్లు, మొబైల్ టవర్ల ఏర్పాటు ● పునరావాస కేంద్రాల్లోని వారికి నిత్యావసరాల పంపిణీ ● సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం ● తుఫాన్‌పై ముఖ్యమంత్రితో ఫోన్లో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోడీ ● రాష్ట్రానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని భరోసా ● పీఎంవోతో సమన్వయ బాధ్యతలు మంత్రి లోకేష్‌కు అప్పగించిన సీఎం



అమరావతి, అక్టోబర్ 27:లి మొంథా తుఫాన్ ప్రభావాన్ని, నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరేలా రియల్ టైమ్‌లో సమాచారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఉదయం నుంచి ప్రతీ గంటకూ తుఫాన్ బులిటెన్లు విడుదల చేస్తూ, అప్రమత్తం చేయాలని సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మొంథా తుఫాన్ కారణంగా నెలకొన్న పరిస్థితులు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎక్కడా సమాచార పంపిణీ వ్యవస్థకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని చెప్పారు. కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు శాటిలైట్ ఫోన్లు వినియోగించాలని, మొబైల్ టవర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావం ఎక్కువ ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జెనరేటర్లను పవర్ బ్యాకప్ కోసం వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఎక్కడా కమ్యూనికేషన్ వ్యవస్థకు అవాంతరాలు తలెత్తకూడదన్నారు. తుఫాన్ వల్ల ఎవరూ ప్రమాదాలబారిన పడకూడదని, ఒక్క మరణం సంభవించకూడదనేది ప్రభుత్వ లక్ష్యం కావాలన్నారు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వారికి 25 కేజీల బియ్యంతో సహా నిత్యావసరాలు అందించాలన్నారు. కరువును ఎదుర్కొనేందుకు ఎలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామో, తుఫాన్లను ఎదుర్కొనేందుకూ పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు జరపాలని సీఎం చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానికి వివరించగా, కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని భరోసా ఇచ్చారని తెలిపారు. ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకునే బాధ్యతను మంత్రి లోకేష్‌కు ముఖ్యమంత్రి అప్పగించారు. లికృష్ణా జిల్లాలో అతిభారీ వర్షాలకు అవకాశం :లి ప్రస్తుతం కాకినాడకు 680 కి.మీ. దూరంలో ఉన్న మొంథా తుఫాన్...16 కి.మీ వేగంతో తీరానికి చేరువ అవుతోందని... దీని ప్రభావంతో ఇప్పటికే ఉత్తర, దక్షిణ కోస్తాలో వర్షాలు కురుస్తున్నాయని... మంగళవారం కృష్ణా జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించామని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ వెనక్కి రప్పించినట్టు వెల్లడించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. మంగళవారం రాత్రికి తుఫాన్ తీరానికి చేరే అవకాశం ఉందన్నారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎన్డీఆర్, ఎస్డీఆర్ దళాలు అందుబాటులో ఉండాలని, ఫైర్ సర్వీసెస్ కూడా అలెర్ట్‌గా ఉండాలని చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ టీమ్, రహదారులు-భవనాల శాఖ, విద్యుత్ శాఖ పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. రహదారులు కోతకు గురైనా, విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడినా వెంటనే పునరుద్ధరించేలా మెటీరియల్, మిషనరీ సిద్ధం చేయాలని, కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తుఫాను అనంతరం అంటువ్యాధులు సోకకుండా పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. తుఫాను సమయంలో గర్భిణిలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచి వైద్య సౌకర్యాలు కొనసాగేలా చూడాలన్నారు. యాంటీ స్నేక్ వెనోమ్, యాంటి ర్యాబిస్ వ్యాక్సిన్లు కూడా అన్ని పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. మరోవైపు పంటనష్టం సంభవించకుండా టార్పాలిన్లు విరివిగా ఉంచాలని, పశుసంపద నష్టపోకుండా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 851 జేసీబీలు, 757 పవర్ సాలు సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, ఏ ప్రాంతంలో అందుబాటులో ఉంచారనేది మ్యాపింగ్ చేయాలని... తుఫాన్ అనంతరం వీటన్నింటి వినియోగంపైనా ఆడిటింగ్ చేస్తామని సీఎం చెప్పారు. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్టం చేయాలని నిర్దేశించారు.

విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు :లి 'తుఫాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుంది. ఆ సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలి. ఎప్పటికప్పుడు సందేశాలు పంపించి అవగాహన పెంచాలి. తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుఫాన్లపై అనుభవాన్ని ఇందుకు వినియోగించాలి. అన్ని రిజర్వాయర్లు, ట్యాంకులు ఎలా నిర్వహించాలనే దానిపై జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయండి. రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి. బలమైన గాలులకు కూలిపోయే అవకాశం ఉన్న చెట్ల కొమ్మలను ముందుగానే తొలిగించాలి.' అని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. అలాగే తుఫాన్ రక్షణ విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సమీక్షలో మంత్రులు లోకేష్, అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ బాధ్యతలు స్వీకరణ



అమరావతి, అక్టోబర్ 27: జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆయనతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు.జస్టిస్ మానవేంద్ర రాయ్ స్వస్థలం ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురం.న్యాయవిద్య అభ్యసించిన తదుపరి 2002 లో జిల్లా జడ్జి క్యాడర్లో నియమితులై వీరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో న్యాయ సేవలు అందజేశారు.2015 జూలై నుండి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ గా మరియు 2019 జూన్ నుండి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందజేయగా 2023 నవంబర్ లో గుజరాత్ హైకోర్టుకు బదిలీపై వెళ్లారు.గుజరాత్ హైకోర్టు నుంచి బదిలీపై సొంత రాష్ట్రానికి వచ్చిన ఆయన తిరిగి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం,ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి,పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ సభ్యులు మరియు హైకోర్టు ఉద్యోగులు,ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండండి

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం: మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28,29 తేదిల్లో ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. వర్షాలతో పాటు, సముద్రం కూడా అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని కోరారు. అదేవిధంగా రైతులు ఎవ్వరు కూడా ఆందోళన చెందవద్దని తెలిపారు. అధికారులు అందరు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. విద్యుత్, త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో పరిస్థితులపై అధికారులతో ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. సహాయక చర్యల కోసం బృందాలు కూడా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శ్రీకాకుళం కంట్రోల్ రూమ్ 08942-240557 ను సంప్రదించాలని కోరారు.

## సీఎంకు పీఎం మోడీ ఫోన్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మోకా తుఫాను నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబుతో ప్రధాని మోదీ మాట్లాడారు. తుఫాను ప్రభావం, ముందు జాగ్రత్త చర్యలపై సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు రెడ్ అలర్ట్, రాయలసీమకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. రాష్ట్రంలో తుఫాన్ ప్రభావం, రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల గురించి మాట్లాడారు. తుఫాన్ పరిస్థితిపై ఆరా తీశారు.. కేంద్రం అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం చంద్రబాబు మంత్రులు లోకేశ్, అనిత, సీఎస్ విజయానంద్ ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి లోకేశ్‌కు సీఎం సూచించారు. తుఫాను కదలికలను ప్రతి గంటకూ గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదలు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కాల్వ గట్లను పటిష్టం చేసి, పంటలకు నష్టం జరగకుండా చూడాలని.. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని..ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు మొంథా తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో వాతావరణం మారింది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కాకినాడలో ఉదయం మొదలైన చిరుజల్లులు, 10 గంటల తర్వాత జోరందుకున్నాయి. విశాఖపట్నంలోని మధురవాడలో బలమైన గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. వాతావరణ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. అంటే ఈ ప్రాంతాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక. రాయలసీమ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చారు. ఇది కూడా జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితిని సూచిస్తుంది. మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే ఐదు రోజుల పాటు ఎవరూ వేటకు వెళ్లవద్దని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉంది. అన్ని ఓడరేవుల్లోనూ ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. విశాఖపట్నం తీరంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. అలలు చాలా ఎత్తుగా వస్తున్నాయి. దీంతో రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లను అధికారులు మూసివేశారు. ప్రజలు బీచ్‌లకు వెళ్లడం సురక్షితం కాదని తెలిపారు. తుఫాన్ ప్రభావంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా,ఆస్తి నష్టం వీలైనంత మేరకు తగ్గించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ప్రజలు వదంతులు నమ్మకుండా వాస్తవ సమాచారం తెలుసుకునేందుకు.. అలాగే అవసరమైన సాయం కోసం ప్రభుత్వం కేటాయించిన టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు. స్టేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు 112, 1070ను.. టోల్ ఫ్రీ నంబర్ 18004250101ను సంప్రదించాలన్నారు.

# మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

● ప్రభావిత ప్రాంతాల్లో యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉంచాలి ● ప్రాణ నష్టం సంభవించకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి ● ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి ● పునరావాస కేంద్రాల్లో ఆహారం, రక్షిత తాగునీరు, పాలు, ఔషధాలు సిద్ధం చేసుకోవాలి ● ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి నారాయణ వీడియో కాన్ఫరెన్స్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని 12 మండలాల పరిధిలో తుపాను ప్రభావం ఉండనున్న క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. అంబులెన్సులు, అత్యవసర సర్వీసులు సిద్ధం చేసుకోవాలని, ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్య పెంచుకోవాలని సూచనలు చేశారు. మండలాల వారీగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి సమాచారం కోసం అత్యవసర ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. మొంథా తుపాను ప్రభావం, ముందస్తు సహాయక చర్యలపై జిల్లా ఇంఛార్జి మంత్రి పి. నారాయణ , స్పెషల్ ఆఫీసర్ కృష్ణ తేజ , జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ , జిల్లా ఎస్పీ బిందు మాధవ్ , ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లా పరిధిలోని 12 మండలాలపై ఉండనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికల ద్వారా తెలుస్తోంది. రేపు కాకినాడ పరిసరాల్లో తీరం దాటే అవకాశం ఉంది. తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుపానును ఎదుర్కొనేందుకు ప్రభావిత మండలాల పరిధిలో యంత్రాంగం పూర్తి సన్నద్ధతో ఉండాలి. ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలి. ముందుగా తీర ప్రాంత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, పాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. పిఠాపురం నియోజకవర్గంతో పాటు కాకినాడ జిల్లావ్యాప్తంగా గర్భిణి స్త్రీలు, బాలింతలు, వృద్ధులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించినట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. వారికి అవసరం అయిన పౌష్టికాహారం, వైద్య సాయం అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసిన విషయాన్ని ప్రజలకు తెలియపర్చండి. తుపాను పట్ల ప్రజల్లో భయాందోళనలు లేకుండా గ్రామాల్లో మైకుల ద్వారా తుపాను ప్రభావం, తీసుకుంటున్న సహాయక చర్యలను వివరించాలి. గజ ఈతగాళ్లను తీర ప్రాంతంతో పాటు లోతట్టు ప్రాంతాలు, వాగుల వద్ద సిద్ధంగా ఉంచాలి. గాలుల తీవ్రతకు విద్యుత్ స్తంభాలు నేల కూలే అవకాశం ఉంది. తక్షణం వాటిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలి. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బ తినే అవకాశం ఉన్నందున అత్యవసర పరిస్థితుల్లో యంత్రాంగం శాటిలైట్ ఫోన్ల ద్వారా సమాచారం చేరవేయాలి.

**అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

తుపాను ప్రభావం ఉన్న అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్లు, వీర్వోలు అందుబాటులో ఉండాలి. పోలీసులు... ముంపు ప్రాంతాల్లో భద్రత చర్యల పర్యవేక్షణ పెంచాలి. పునరావాస కేంద్రాలకు వెళ్లే ప్రజల ఇళ్లకు సైతం భద్రత కల్పించాలి. ప్రజలు ఇళ్లలో లేని సమయంలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలతో ప్రత్యేక భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలి. బలహీనంగా ఉన్న చెరువులు, వాగులు, కుంటల గట్లను గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవాలి. గండ్లు పడితే పూడ్చేందుకు వీలుగా ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలి. తుపాను తీవ్రత ఉన్నందున మత్స్యకార గ్రామాలను మత్స్యశాఖ అధికారులు అప్రమత్తం చేయాలి. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలి. మత్స్యకారుల బోట్లు దెబ్బ తినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. కూరగాయలు, నిత్యవసర సరకుల సరఫరాకు అడ్డంకులు లేకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అత్యవసర సాయం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్ల విడుదల చేసింది. అందులో కాకినాడ జిల్లాకు కోటి రూపాయిలు కేటాయించారు. ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, ప్రజలకు నిత్యవసర సరుకుల పంపిణీ, ఇళ్లు కూలడం, దెబ్బ తినడం వంటి సంఘటనలు జరిగితే తక్షణ సాయం చేయడం వంటి చర్యలు తీసుకోవాల"ని దిశానిర్దేశం చేశారు.

# మొంథా తుఫాన్.. 43 రైళ్లు రద్దు



● విశాఖ మీదుగా నడిచే పలు రైళ్లు రద్దు ● కొన్ని కీలకమైన రైళ్లు రద్దు ● తుఫాన్ తర్వాత పునరుద్ధరణ ● ఆంధ్ర వైపు దూసుకొస్తున్న తుఫాన్ ● ప్రయాణికుల భద్రత దృష్ట్యా చర్యలు తీసుకున్న రైల్వే శాఖ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మొంథా తుఫాన్ ఆంధ్రా వైపు దూసుకొస్తోంది. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇదిలా ఉండగా.. మొంథా తుఫాన్ నేపథ్యంలో రైల్వేశాఖ అలర్ట్ అయ్యింది. తుఫాను కారణంగా ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని విశాఖ మీదుగా నడిచే 43 రైళ్లను రద్దు చేస్తున్నట్లుగా తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. రద్దయిన రైళ్లలో గోదావరి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, గరీబ్ రథ్, విశాఖపట్నం తిరుపతి ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఎల్టిటీతో పాటు పలు ప్రధాన రైళ్లు, పలు పాసింజర్ రైళ్లు ఉన్నాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు అంటే అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో విశాఖ మీదుగా సాగే రైల్వే సర్వీసులు రద్దు అయ్యాయి. క్యాన్సెల్ అయిన రైలు సర్వీసుల జాబితాను రైల్వే శాఖ విడుదల చేసింది. తుఫాను తీవ్రతను బట్టి రైల్వే సర్వీసులను పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**రద్దయిన రైళ్ల వివరాలు**

27, 28 తేదీల్లో 18515/16 విశాఖపట్నం - కిరణ్ డోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు
27, 28 తేదీల్లో 18525/26 విశాఖపట్నం - బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు
27వ తేదీన 22707 విశాఖపట్నం - తిరుపతి డబల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు
27వ తేదీన 17243/44 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు
27వ తేదీన 12727 గోదావరి ఎక్స్‌ప్రెస్ రద్దు
27వ తేదీన 12738 విశాఖ సికింద్రాబాద్ మధ్య నడిచే గరీబ్ రథ్ రద్దు
27వ తేదీన 22707 విశాఖపట్నం తిరుపతి డబల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు
27, 29 తేదీల్లో 20805/06 విశాఖపట్నం న్యూఢిల్లీ ఏపీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు
27, 29 తేదీల్లో 18519/20 ఎల్టీటీ - విశాఖపట్నం (ఎక్స్‌ప్రెస్) రాకపోకలు రద్దు
27, 28 తేదీన 12861/ 62 విశాఖపట్నం - మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రద్దు
27, 28 తేదీల్లో 22869/70 విశాఖపట్నం ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు
27, 28 తేదీల్లో 08583/84 విశాఖపట్నం - తిరుపతి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు
27, 28 తేదీల్లో 18512/11 విశాఖపట్నం - కొరాపుట్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు
27, 28 తేదీల్లో 67287/88 విశాఖపట్నం - కిరణ్ డోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు
27, 28 తేదీల్లో 67287/88 విశాఖపట్నం - విజయనగరం రైలు రాకపోకలు రద్దు
28వ తేదీన 67289/90 విశాఖపట్నం - పలాస రాకపోకలు రద్దు
28వ తేదీన 67285/86 రాజమండ్రి - విశాఖపట్నం రాకపోకలు రద్దు
28వ తేదీన 17267/68 విశాఖపట్నం - కాకినాడ ఎక్స్ప్రెస్ రాకపోకలు రద్దు
28వ తేదీన 58501/02 కిరణ్ డోల్ - విశాఖపట్నం పాసింజర్ రైలు రాకపోకలు రద్దు
28వ తేదీన 58538/37 కోరాపుట్ - విశాఖపట్నం రాకపోకలు రద్దు
28వ తేదీన 22875/76 విశాఖపట్నం - గుంటూరు డబల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకలు రద్దు
28వ తేదీన 58531/32 బ్రహ్మపూర్ - విశాఖపట్నం పాసింజర్ రాకపోకలు రద్దు
28వ తేదీన 58506/05 విశాఖపట్నం - గుణుపూర్ పాసింజర్ రాకపోకలు రద్దు
28, 29 తేదీల్లో 68433/34 కటక్ - గుణుపూర్ రైలు రాకపోకలు రద్ద చేశారు. రద్దయిన రైళ్ళను తుఫాను ప్రభావం అనంతరం పునరుద్ధరిస్తామని రైల్వే శాఖ అధికారులు వెల్లడించారు.

# తుఫాను ప్రభావిత 12 జిల్లాల్లో పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు



ఏలూరు,ఉమ్మడి ప గో. జిల్లా సూర్య బ్యూరో : జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో సోమవారం రాష్ట్రంలో 'మొంథా' తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న చర్యలుపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్ పాత్రికేయులు సమావేశాన్ని నిర్వహించారు.

మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 'మొంథా' తుఫాను ప్రభావిత 12 జిల్లాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో పౌర సరఫరాలు శాఖ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి మొత్తం 12 జిల్లాలో యుద్ధప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఈ జిల్లాల్లో 14,145 రేషన్ డిపోలు ద్వారా 7 లక్షలు కార్డు దారులు కుటుంబాలకు నిత్యవసర సరుకులు సబ్సిడీ రూపంలో రేపు ఉదయం 9:00 గంటలు నుండి అందిస్తున్నామని అన్నారు. మొంథా తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు జిల్లాలో టార్పాలిన్లు రైతు సేవా కేంద్రాల్లో ఉంచామని రైతులు వాడుకోవచ్చునని తెలిపారు. ఏ ఒక్క రైతు ఇబ్బందులు పడకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 626 వివిధ కంపెనీల బంకులలో 35,443 లీటర్లు డీజిల్ ఆయిల్, పెట్రోల్ అదనంగా నిల్వలను అందుబాటులో ఉంచి, కొరత లేకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. తీర ప్రాంత జిల్లాల్లో ఉన్న 1,500 మిల్లులను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుసంధానం చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు నుంచి తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఇప్పటికే కోత కోసిన వరి ధాన్యం వ్యవసాయ అధికారుల సహకారంతో పౌరసరఫరాల సంస్థ మేనేజర్లు మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గత ఏడాది మాదిరిగానే టార్పాలిన్లు, తాళ్లు, ఇసుక సంచులు, ప్లాస్టిక్ట్ షీట్లు అందుబాటులో ఉంచామని అవసరాన్ని బట్టి వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



"ఆందోళన సృజనాత్మకతకు పరిచారిక."
- టి. ఎస్. ఎలియట్



"తప్పులకు భయపడవద్దు - అవి ఏవీ లేవు."
- మైల్స్ డేవిస్



"సృజనాత్మకతకు నియమాలు లేవు."
- లారా జావోర్స్కి

# తీరప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించండి

● ప్రతీ కేంద్రానికి ఇన్ఛార్జ్... నాణ్యమైన ఆహారం, మెడికల్ క్యాంపులు ● తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు
● వాలంటరీగా వచ్చేవారితో సహాయక చర్యలు చేపట్టండి ● జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు నిర్దేశం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మొంథా తుఫాన్ ముప్పు ఉన్న తీరప్రాంత ప్రజలను తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం నుంచి తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు ప్రత్యేకంగా ఇన్ఛార్జ్‌ను నియమించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి మొంథా తుఫాన్పై అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, మధ్యాహ్నం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో టెలీకాన్ఫరెన్స్ చేపట్టారు. తాగునీటి సమస్య తలెత్తకుండా, ఎక్కడా కలుషితం కాకుండా చూసుకోవాలని చెప్పిన సీఎం అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. తుఫాను ప్రభావిత జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు నిర్దేశించారు. జిల్లాల్లో తుఫాను రక్షణ చర్యలను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని, వాలంటరీగా వచ్చేవారిని తుఫాన్ సహాయక కార్యక్రమాలకు వినియోగించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగమంతా నిబద్ధతతో పనిచేసి మొంథా తుఫాన్ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని అన్నారు.

**కొండచరియలు జారిపడకుండా జాగ్రత్తలు**

మానవ ప్రయత్నంలో ఎటువంటి అలసత్వం కనిపించకూడదని చెప్పిన ముఖ్యమంత్రి... వివిధ జిల్లాల కలెక్టర్లతో అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయని... అన్ని రక్షణ చర్యలు తీసుకున్నామని ఆ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సీఎంకు వివరించారు. ఆర్టీజీఎస్ నుంచి సమాచారం ఎప్పటికప్పుడు



అందుతుందని... ఎక్కడా చెరువులు, కాలువ గట్లు తెగకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారీ వర్షాలతో నీరు ఎక్కడా నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. తుఫాను సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా చూసుకోవాలని చెప్పారు. విజయవాడ, మంగళగిరి, విశాఖ వంటి కొండ ప్రాంతాల్లో కొండచరియలు జారిపడి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. మొంథా తుఫాన్ కార్యాచరణ భవిష్యత్లో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్ కావాలని చెప్పారు.

## స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌ను సందర్శించిన

### కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

● ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలి
● లోతట్టు ప్రాంతాల ప్రజలు శిబిరాలకు చేరాలి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్న స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం సాయంత్రం సందర్శించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితిలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ముందస్తు సమాచారాన్ని అధికారులకు, ప్రజలకు సకాలంలో అందజేస్తూ వారిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. సంభవించబోయే భారీ తుఫాను నేపథ్యంలో ఎటువంటి ప్రాణనష్టం కానీ ఆస్తి నష్టం గాని జరగకుండ మందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆహార పదార్థాలు, అత్యవసర వస్తువులు, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని అధికారులు నిరంతరం శిబిరాల వద్ద ఉండి వరద బాధితులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ లో రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులను, తుఫాను ప్రభావాన్ని టీవీ మానిటర్లలో పరిశీలించారు.



# బ్రాండిక్స్ సంస్థను ఆదుకుంటాం అవసరమైన చర్యలు

● అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ హామీ
● బ్రాండిక్స్ ఇండియా భారతీయ భాగస్వామి దొరస్వామితో చర్చలు

అమరావతి : ట్రంప్ అదనపు టారిఫ్ల కారణంగా తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్న బ్రాండిక్స్ ఇండియా సంస్థను ఆదుకునేందుకు , పరిస్థితిని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్తో చర్చించి ఉపశమన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. బ్రాండిక్స్ ఇండియా డైరెక్టర్ మరియు భారతీయ భాగస్వామి పి. సి. దొరస్వామి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడంతో పాటు ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను కూలంకషంగా వివరించారు. దేశవ్యాప్తంగా దుస్తుల తయారీ రంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ముఖ్యంగా రాష్ట్రానికి తలమానికంగా ఉన్న అతి పెద్ద వస్త్ర తయారీ పరిశ్రమ బ్రాండిక్స్ ఇండియా సంస్థను ఈ టారిఫ్ తీవ్రంగా దెబ్బతీశాయని తెలిపారు. ఎస్, ఇ.జెడ్ పరిధిలోని బ్రాండిక్స్ 80 శాతం అమెరికా ఎగుమతులపైనే ఆధారపడి వున్నదని, వర్క్ ఆర్డర్లు లేకపోవడం మూలంగా ఇప్పటికే కొన్ని సందర్భాల్లో ఉద్యోగులకు సెలవులు ప్రకటిస్తున్న విషయంపై విచారం వ్యక్తం చేస్తూ వారి ఉద్యోగ భద్రతకు ఎటువంటి డోకా ఉండదని భరోసా ఇచ్చారు. "బ్రాండిక్స్ ఇండియా సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తలమానికమైన పరిశ్రమ మాత్రమే కాకుండా సామాజిక పరంగా కూడా ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తున్నదని" అన్నారు. ఇప్పటికే లక్ష మంది వరకూ ఉపాధి అవకాశాలు కల్పించి, ప్రస్తుతం 20 వేల మందికి పైగా గ్రామీణ యువత, ముఖ్యంగా మహిళలకు ఉద్యోగాల కల్పనలో, గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో విశేష ఫలితాలు సాధిస్తున్నదని పేర్కొన్నారు., సంస్థను మరియు ఉద్యోగులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 50 శాతం వరకు టారిఫ్ విధించబడటం వల్ల సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. అమెరికా మార్కెట్లో పోటీ పడటం దాదాపు అసాధ్యమైందని, దీని ప్రభావం ఉద్యోగులపై పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకువెళ్లిన అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున మూడు అంశాల్లో బ్రాండిక్స్ ఇండియా సంస్థకు సహకారం కావాలని దొరస్వామి మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు: సంస్థ దిగుమతి చేసిన ముడి పదార్థాలపై మాత్రమే సుంకం విధిస్తూ, ఎస్ఈజెడ్ల నుండి దేశీయ విక్రయాలను గరిష్ఠంగా 49% వరకు అనుమతించాలని కోరారు. ఎస్ఈజెడ్ యూనిట్లకు RoSCTL ప్రయోజనాలను 5% రేటుతో మళ్లీ అమలు చేయాలని సూచించారు. ఎస్ఈజెడ్ యూనిట్లు దేశీయ మార్కెట్ తయారీదారులకు సబ్కాంట్రాక్టింగ్ చేయడానికి అనుమతించాలని, తద్వారా భారత మార్కెట్లో ఎస్ఈజెడ్ల సమగ్ర అనుసంధానం సులభతరం అవుతుందని వివరించారు.

ఈ సందర్భంగా బ్రాండిక్స్ సంస్థలో ఉపాధి అవకాశాలకు ఎటువంటి నష్టం కలుగకుండా అత్యవసరంగా తీసుకోవాల్సిన ఈ చర్యల విషయమై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్తో చర్చిస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.

### పూర్తయిన అగ్రిమెంట్

## కార్పొరేట్ కార్యాలయ శిక్షణ కేంద్రం

### 290 మందికి ఉపాధి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, అమరావతిలోని ఉద్ధండరాయునిపాలెం గ్రామంలో తమ ప్రాంతీయ కార్యాలయాన్ని నిర్మించనుంది. ఈ మేరకు సంబంధిత అగ్రిమెంట్ను సోమవారం బ్యాంక్ అధికారులు పూర్తి చేశారు. కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బి.వేణు గోపాల్ రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పమ్మి హేమంత్ కుమార్లకు, సిఆర్డిఏ ఎస్టేట్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్ రాజు..సంబంధిత అగ్రిమెంట్ను అందజేశారు. అమరావతిలో కార్యాలయ నిర్మాణంతో పాటు తమ కార్యకలాపాల నిర్వహణకై కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్..రాజధానిలో సుమారు రూ.20 కోట్ల పైబడి పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొంది. తమ కార్యకలాపాల నిర్వహణతో 290 మందికి ఉపాధి కల్పిస్తామని కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ స్పష్టం చేసింది. అమరావతిలో బ్యాంక్ నిర్వహణకు సంబంధించి కార్పొరేట్ కార్యాలయం, శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ వివరాలు వెల్లడించింది. అగ్రిమెంట్ పూర్తి కావడంతో రాజధాని అమరావతిలో బ్యాంక్ కార్యకలాపాల విస్తరణకు కీలకమైన ముందడుగు పడింది.

# తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● సెలవుల్లో ఉన్న అధికారులు వెంటనే విధుల్లో చేరాలి ● చెరువులు, కాల్వ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేయాలి
● బుడమేరు డైవర్షన్ ఛానెల్‌పై నిరంతర నిఘా ఉండాలి ● జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మొంథా తుపాను ప్రభావిత జిల్లాల్లో ఇరిగేషన్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, సిఈ స్థాయి నుండి కింది స్థాయిలోని లష్కర్ వరకు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. సోమవారం అమరావతి సచివాలయంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కడా స్పెషల్ కమీషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సి నరసింహ మూర్తి, మరియు సిఈలు, ఎస్ఈలు, ఈఈలు, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు అందరూ తమకు కేటాయించిన హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని, అధికారులు తమ సెలవులు రద్దుచేసుకుని, తప్పని సరిగా విధులకు హాజరుకావాలని ఆదేశించారు. చెరువులు, కాల్వ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేయాలి అని, ఇందుకోసం ఇసుక బస్తాలు, మోటార్లు, బోట్లువంటి అత్యవసర సామాగ్రి సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు, గేట్లు, స్యూయిజ్ లు, సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో, ఎప్పిటికప్పుడు తనిఖీ చేయాలని, అధికారులకు సూచించారు. తుఫాన్ కారణంగా వాగులు, రిజర్వాయర్ల నుండి దిగువకు నీరు విడుదల చేసేముందు, సమీప ప్రవాహ ప్రాంత ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేయాలి అని అన్నారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, పంటలకు నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అన్నారు. ఎన్టీఆర్ జిల్లా లో వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకుని, బుడమేరు డైవర్షన్ ఛానెల్ పై నిరంతర నిఘా ఉండాలని, వెలగలేరు రెగ్యులేటర్ నుండి ఎనికేపాడు యూటీ వరకు విజయవాడ నగర పరిధిలో ఓల్డ్ బుడమేరు అంతా, ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా, తొలగించాలి అని తెలిపారు. ఎర్ర కాలువ, యనమదురు డ్రైన్, బురద కాలువ, సుద్ద వాగు, ఏలేరు రిజర్వాయర్, రైవాడ కాలువ వంటి వాటిపై



నిరంతర నిఘా పెట్టాలి అని, జిల్లా కలెక్టర్, రెవిన్యూ, డిజాస్టర్ మేనేజ్మెంట్, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఆర్డబ్ల్యూఎస్, శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

## తుఫాన్ తగ్గేవరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

● ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి ● పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి ● మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ● మొంథా తుఫానుపై ప్రకాశం, విశాఖ జిల్లాల కలెక్టర్లతో మంత్రి సమీక్ష



ప్రకాశం / తూర్పు నాయుడుపాలెం : తుఫాన్ తగ్గేవరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం నాడు మొంథా తుఫానుపై ప్రకాశం, విశాఖ జిల్లాల కలెక్టర్లతో మంత్రి డా.స్వామి సమీక్షించారు. కలెక్టర్లతో మంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి తుపాన్ ప్రభావాన్ని, అధికార యంత్రాంగం ఏర్పాట్లు మంత్రి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తుఫానుపై సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం సమీక్షిస్తున్నారు. తుఫాన్ తగ్గేవరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి.అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యశాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు నీరు, ఆహారం, పాలు అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉంచాలి. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు.ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని, జాగ్రత్తగా ఉండాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు.



# ఆసుపత్రులకు 787 మంది గర్భిణిల తరలింపు

### పునరావాస కేంద్రంలో వైద్య శిబిరాలు : మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

ఏపీ స్టేట్ క్రైమ్ బ్యూరో : 'మొంథా' తుపాన్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ప్రసవ తేదీకి వారం రోజుల వ్యవధి కలిగిన సుమారు 787 మంది గర్భిణిలను సమీప ఆసుపత్రులకు తరలించినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఎ.ఎన్.ఎం.ల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. ప్రసవ సమయానికి దగ్గర్లో ఉన్న గర్భిణిలను సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులకు స్థానిక అధికారులు పంపిస్తున్నారని చెప్పారు. హైరిస్కులో ఉన్న గర్భిణిల విషయంలో వైద్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు. కృష్ణా జిల్లాలో 240, ఏలూరు జిల్లాలో 171, కోనసీమ జిల్లాలో 150, తూర్పు గోదావరి జిల్లాలో 142 మంది గర్భిణిలను ఇప్పటివరకు తరలించినట్లు తెలిపారు.అలాగే ఇతర జిల్లాల్లో కూడా ఇదేవిధంగా గర్భిణిలను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తుపాన్ ప్రభావిత 17 జిల్లాల్లో ఈ చర్యలు కొనసాగుతున్నాయని సోమవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

**పీహెచ్ సి వైద్యుల నేతృత్వంలో వైద్య శిబిర్యాలు**

తుపాన్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని 17 జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన షెల్టర్ల (పునరావాస కేంద్రాలు)లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి వైద్య శిబిరంలో ఓ పీహెచ్ సి మెడికల్ ఆఫీసర్, ఎ.ఎన్.ఎం., ఆశా వర్కర్ ను నియమించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 551 షెల్టర్లను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని చెప్పారు. ఉప ఆరోగ్య కేంద్రాల్లో సీహెచ్ ఓ లు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

**నిశితంగా హాజరు పరిశీలన**

తుపాన్ సహాయక విధుల్లో పాల్గొనే వారి హాజరును నిశితంగా పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ స్పష్టంచేశారు. జిల్లాలకు పంపిన ప్రామాణిక విధి విధానాలు (స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్స్)కు అనుగుణంగా అధికారులు, వైద్యులు, సిబ్బంది వ్యవహరించాలని స్పష్టంచేశారు. సోమవారం సాయంత్రం అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులతో... కార్యదర్శితోపాటు ఇంఛార్జి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ నీలకంఠారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## మొంథా తుపాను ఎఫెక్ట్ - పలు విమాన సర్వీసులు రద్దు



అమరావతి : 'మ్నెంథా' తుపాను తీరం దిశగా చురుగ్గా కదులుతోంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేయగా తాజాగా పలు విమాన సర్వీసులు కూడా రద్దయ్యాయి. విజయవాడ, విశాఖ విమానాశ్రయాల మీదుగా రాకపోకలు సాగించే ఎయిరిండియా, ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. విజయవాడ - ఢిల్లీ వెళ్లే విమానాలు మినహా మిగిలిన ఎయిరిండియా సర్వీసులను రద్దు చేశారు. ఈ మేరకు ఇప్పటికే ప్రయాణికులకు సమాచారం ఇచ్చినట్లు ఎయిరిండియా తెలిపింది.

**రద్దయిన విమాన్యాల వివర్యాలు:**

IX 2819: విశాఖపట్నం-విజయవాడ,IX-2862: విజయవాడ-హైదరాబాద్,
IX-2875: విజయవాడ- బెంగళూరు,IX-976: షార్జా- విజయవాడ,
IX-975: విజయవాడ - షార్జా,IX-2743: హైదరాబాద్- విజయవాడ,
IX-2743: విజయవాడ- విశాఖపట్నం.

### కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయకర్తగా మంత్రి లోకేశ్ సేవలు ప్రశంసనీయం

మంత్రి గొట్టిపాటి రవి కుమార్



అద్దంకి: కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయకర్తగా నారా లోకేశ్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని జే పంగులూరు మండలం ముప్పవరం పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. మొత్తం 78 మంది లబ్ధిదారులకు రూ. 45 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. అనంతరం ముగ్గురు పార్టీ కార్యకర్తల కుటుంబాలకు కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి ప్రమాద బీమా చెక్కులను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం పట్ల పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. "పార్టీ విజయాలు, నాయకుల ప్రగతికి కార్యకర్తలే పునాది. అందుకే వారి సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుంది," అని మంత్రి అన్నారు. కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా చనిపోయిన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని, ఇది పార్టీ కార్యకర్తల కుటుంబాలు పట్ల పార్టీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమ నిధిని రూపొందించి అమలు చేయించిన మంత్రి నారా లోకేశ్ గారి సేవలు ప్రశంసనీయమని రవి కుమార్ తెలిపారు. "లోకేశ్ గారి దూరదృష్టితోనే ఈ నిధి ద్వారా కార్యకర్తల కుటుంబాలు భద్రతను పొందుతున్నాయి. పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉండే తీరునే తెలుగుదేశం పార్టీని ప్రత్యేకంగా నిలబెడుతోంది," అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వెంటాడుతున్నమొంథా

# విశాఖను వెంటాడుతున్న హుదూద్ భయం

● తీర ప్రాంతాల్లో ఉప్పెన ప్రమాదం ● విజయవాడకు భారీ వర్ష సూచన ● బుడమేరు పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆందళోన




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మొందా భయం ఏపీ ప్రజలను వెన్నాడుతోంది. విశాఖ ప్రజలు హూదూద్ తుపాన్, తీర ప్రాంతాల ప్రజలకు ఉప్పెన ప్రమాదం పట్ల ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రికి ఏపీ అంతా తుపాను ప్రభావం స్పష్టంగా కనపడుతోంది. క్రమంగా మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం భారీ తుఫానుగా రూపాంతరం చెందేందుకు గంటల వ్యవధి మాత్రమే ఉంది. గంటకు 18 నుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలో కదులుతూ ఏపీ వైపు మొంథా దూసుకుని వస్తోంది. దీంతో ఏపీలో నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకూ రెడ్ అలెర్ట్ ని ప్రకటించారు. భారీ వర్షాలతో సోమవారం తెల్లారుతూనే విశాఖ మొందా ఎఫెక్ట్ ని చూపిస్తోంది దట్టమైన మేఘాలు కమ్ముకుని నగరం అంతా చిల్లులు పడేలా భీకరమైన వానను కురిపిస్తున్నాయి. గాలి తీవ్రత అధికంగా ఉండడంతో నగరంలో భారీ చెట్లు నేలకొరిగాయి. అనేక చోట్ల జనజీవనం స్థంభించింది.ప్రజలు వీలైనంత వరకూ ఇళ్ళలోనే ఉండాలని అధికారులు గట్టి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. బీచ్ లకు వెళ్ళకుండా కట్టడి చేస్తున్నారు. పొర్యలను క్రితం మూసివేశారు. ఒక విధంగా మంథా తుఫాన్ తో నగరంలో అప్రకటిత కర్ఫ్యూ అమలులో ఉంది. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ఇప్పటికి సరిగ్గా పదకొండేళ్ల క్రితం హుదూద్ తుఫాన్ ఇదే నెలలో వచ్చి విశాఖను అతలాకుతలం చేసింది. మళ్ళీ అలాంటి భయం అయితే జనాలలో ఉంది. అయితే ఆనాడు హుదూద్ విశాఖను బలంగా తాకింది. ఇప్పుడు అలాంటి పరిస్థితి అయితే లేదని కానీ ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. అంతకంతకు మొంథా తుపాన్ ప్రభావం తీవ్రంగా పెరుగుతోందని చెబుతున్నారు. దాంతో రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ హెచ్చరించింది. మత్స్యకారులు ఐదు రోజులపాటు సముద్ర యాత్రలకు వెళ్లరాదని సూచించింది. విశాఖ సాగరం అయితే గంభీరంగా ఉంది. ఇది తుఫాను ముందు ప్రశాంతత అని వేరేగా చెప్పక్కర్లేదు. మొంథా ప్రభావం రానున్న ఇరవై నుంచి ముప్పయి ఆరు గంటలలో అధికంగా ఉంటుందని అంటున్నారు. బుధవారంతోనే సూర్యోదయానికి అవకాశం అని పేర్కొంటున్నారు.

**విజయవ్వాడకు భారీ వర్ష సూచన**

విజయవాడ నగర ప్రజలకు జిల్లా ఉన్నతాధికారులు కీలక సూచనలు చేశారు. మంగళవారం విజయవాడలో అతి భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు జిల్లా అధికారులు హెచ్చరించారు.మంగళవారం ఒక్కరోజే నగరంలో సుమారు 162 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీ శా, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ విషయాన్ని వాతావరణ శాఖ వెల్లడించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో అత్యవసర సేవల కోసం తప్ప బయటకు రావద్దని నగర ప్రజలకు వారు సూచించారు. సోమవారం ఈ తుపాన్ పరిస్థితులపై ఉన్నతాధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇళ్లలోనే ఉండాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే అన్ని దుకాణాలతోపాటు వాణిజ్య సంస్థలు మూసివేయాలని ఆదేశించారు.మెడికల్ షాపులు, కూరగాయలు, పాలు విక్రయ కేంద్రాలు తదితర సేవా కేంద్రాలు తెరిచి ఉంచాలన్నారు. ఇక అవసరం లేని ప్రయాణాలు, షాపింగ్, వినోదం, మార్నింగ్ వాక్, పార్కుల సందర్శన తదితర కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలని నగర ప్రజలకు మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర స్పష్టం చేశారు. డిస్ట్రిక్ట్ కమాండ్ కంట్రోల్ రూమ్ 9154970454, అలాగే విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 0866 2424172, 0866 2422515, 0866 2427485.. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు విజయవాడ నగర పాలక సంస్థ ప్రకటన విడుదల చేసింది.

## 2 జిల్లాల్లోని గిరిజనులకు త్వరలో 89,845 దోమ తెరల పంపిణీ

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



ఏపీ స్టేట్ క్రైమ్ బ్యూరో : అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎంపికచేసిన గిరిజనుల కుటుంబాల వారికి 89,845 దోమ తెరలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దోమల ద్వారా వచ్చే మలేరియా జ్వరాల వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా దోమ తెరలను ఎంపిక చేసిన గిరిజనుల కుటుంబాలకు ఇస్తామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గడిచిన 3 సంవత్సరాల్లో అధికంగా నమోదైన మలేరియా జ్వరాల కేసుల ప్రాతిపాదికన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కలిపి, ఎంపికచేసిన 743 గ్రామల్లోని గిరిజనులకు వీటిని అందచేస్తామని తెలిపారు పార్వతీపురం మన్యం జిల్లాకు 26,338, అల్లూరి సీతారామరాజు జిల్లాకు 63,507 దోమ తెరలను పంపిణీ చేస్తామని తెలిపారు. వీటి ద్వారా ఎంపికచేసిన సదరు కుటుంబాల్లో ఉన్న సుమారు 2 లక్షల మంది గిరిజనులు ప్రయోజనం పొందుతారని వెల్లడించారు. 89,845 దోమతెరల కొనుగోలుకు రూ.2.30 కోట్లు వరకు వ్యయం కావొచ్చునని అంచనా నెల రోజుల్లో గిరిజనులకు వీటిని అందచేయనున్నారు.

**క్రిమిసంహారక మందుతో తెరల తయారీ.!**

క్రిమీ సంహారక మందును వినియోగించి తయారుచేసిన ఈ దోమ తెరలు దోమలను సంహరిస్తాయి. నిదురపోయే సమయంలో సాధారణ దోమ తెరలు మాదిరిగానే వీటినీ ఉపయోగిస్తారు. వినియోగతీరును అనుసరించి ఈ దోమ తెరలు మూడేళ్ల నుంచి నాలుగేళ్ల వరకు పనిచేస్తాయి.

సూర్య
విజయవాడ
మంగళవారం
28 అక్టోబర్ 2025



# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## 'కఫాలా' రద్దు తో పూర్తి విముక్తి వచ్చినట్టేనా ?

గల్ఫ్ దేశాలలో అమల్లో ఉన్న కఫాలా వ్యవస్థ లక్షలాది మంది వలస కార్మికులకు ఒక పెద్ద సమస్యగా మారింది. ఈ వ్యవస్థ అరబిక్లో 'స్పాన్సర్షిప్' లేదా 'హామీ' అనే అర్థాన్ని సూచిస్తుంది. 1950లలో చమురు సంపద పెరిగిన తర్వాత, గల్ఫ్ దేశాల నిర్మాణానికి చౌకగా విదేశీ కార్మికులు అవసరమైనప్పుడు ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం ప్రకారం, భారతదేశం, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల నుంచి వచ్చే ప్రతి కార్మికుడు ఒక స్థానిక స్పాన్సర్ (యజమాని లేదా కఫీల్) కింద పనిచేయాల్సి ఉంటుంది. ఈ కఫీల్కు కార్మికుడి నివాసం, వీసా మరియు చట్టపరమైన హోదాపై దాదాపు పూర్తి నియంత్రణ ఉండేది. దీని కారణంగా, మానవ హక్కుల సంఘాలు ఈ కఫాలా వ్యవస్థను తరచుగా 'ఆధునిక బానిసత్వం'గా అభివర్ణించేవి. కఫాలా వ్యవస్థ కింద గల్ఫ్ కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారు. యజమానులు చేసే అత్యంత అమానవీయ చర్యలలో ఒకటి, కార్మికుల పాస్పోర్టును స్వాధీనం చేసుకోవడం. చట్టబద్ధంగా ఇది సరైంది కానప్పటికీ, పాస్పోర్ట్ తమ వద్ద ఉండటం వలన కార్మికుడు తమ ఆధీనంలో ఉంటాడని యజమానులు భావిస్తారు. పాస్పోర్ట్ లేకుండా, కార్మికులు ఉద్యోగం మారడానికి, దేశం విడిచి వెళ్లడానికి లేదా వేధింపుల గురించి అధికారులకు ఫిర్యాదు చేయడానికి భయపడేవారు, ఎందుకంటే వారు చట్టపరమైన రక్షణ కోల్పోయినట్లు భావించేవారు. అంతేకాకుండా, యజమాని అనుమతి లేకుండా కార్మికులు ఉద్యోగం మారడానికి లేదా స్వదేశానికి తిరిగి వెళ్లడానికి అవసరమైన 'ఎగ్జిట్ వీసా' తీసుకోవడానికి కూడా వీలుండేది కాదు. దీనివల్ల, జీతాలు ఆలస్యం చేసినా, తక్కువ చెల్లించినా, లేదా పని పరిస్థితులు దారుణంగా ఉన్నా, కార్మికులు ఎక్కడికీ వెళ్లలేక బంధీలుగా మారేవారు.

గల్ఫ్ దేశాలలో దశాబ్దాలుగా లక్షలాది మంది వలస కార్మికుల జీవితాలను నియంత్రించిన కఫాలా) స్పాన్సర్షిప్ వ్యవస్థను సౌదీ అరేబియా ప్రభుత్వం అధికారికంగా రద్దు చేసింది. 'స్పాన్సర్షిప్' అని అర్థం వచ్చే ఈ అరబిక్ పదం, ఒకప్పుడు భారతీయ కార్మికులతో సహా ఆసియా దేశాల శ్రామికులకు ఆధునిక బానిసత్వంగా మారింది. 1950లలో చమురు సంపదతో దేశాన్ని నిర్మించుకునే క్రమంలో ఈ విధానం మొదలైంది. దీని ప్రకారం, ప్రతి విదేశీ కార్మికుడు ఒక స్థానిక స్పాన్సర్ (యజమాని లేదా కఫీల్) కింద పనిచేయాలి, వారి నివాసం, వీసా మరియు చట్టపరమైన హోదాపై ఈ యజమానికే పూర్తి నియంత్రణ ఉండేది.

దీని పర్యవసానంగా, చాలా మంది కార్మికులు యజమానుల దోపిడీకి గురయ్యేవారు. యజమానులు తమ అధికారాన్ని ఉపయోగించి కార్మికుల పాస్పోర్టను స్వాధీనం చేసుకునేవారు, జీతాలు నిలిపివేసేవారు లేదా ఆలస్యం చేసేవారు. కార్మికులు తమ యజమాని అనుమతి లేకుండా ఉద్యోగం మారడానికి లేదా స్వదేశానికి తిరిగి వెళ్లడానికి అవసరమైన 'ఎగ్జిట్ వీసా' తీసుకోవడానికి కూడా వీలు ఉండేది కాదు. ఈ నిబంధనల వల్ల, పని పరిస్థితులు దారుణంగా ఉన్నా, వేధింపులు ఎదురైనా ఎక్కడికీ వెళ్లలేక కార్మికులు బంధీలుగా మారేవారు. ముఖ్యంగా గృహ కార్మికులు (డామెస్టిక్ వర్కర్స్) బయటి ప్రపంచానికి దూరంగా ఉండి మరింత తీవ్రమైన వేధింపులకు గురయ్యేవారు. , సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ చేపట్టిన 'విజన్ 2030' సంస్కరణల ప్రణాళికలో భాగంగా ఈ చారిత్రక మార్పు అమలులోకి వచ్చింది. ఈ రద్దు నిర్ణయం గల్ఫ్ ప్రాంతంలోని కార్మిక హక్కుల రూపురేఖలను మార్చగలదని భావిస్తున్నారు. ఈ సంస్కరణ ద్వారా, కఫాలా వ్యవస్థ స్థానంలో కాంట్రాక్ట్-ఆధారిత ఉపాధి వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ కొత్త నిబంధనల కింద, వలస కార్మికులు తమ ఒప్పందాన్ని పూర్తి చేసిన తర్వాత లేదా తగిన నోటీసు ఇచ్చిన తర్వాత యజమాని అనుమతి లేకుండానే ఉద్యోగాలు మారవచ్చు. అలాగే, యజమాని సమ్మతి లేకుండానే ప్రభుత్వ 'ఖివా' మరియు 'అబ్షర్' వంటి డిజిటల్ ప్లాట్ఫారమ్ల ద్వారా నేరుగా ఎగ్జిట్, రీ-ఎంట్రీ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే స్వేచ్ఛ కూడా లభించింది.

ఈ సంస్కరణ దాదాపు 13 మిలియన్ల మంది వలస కార్మికులకు (వీరిలో భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్ దేశాల వారు అధికం) ఊరటనిచ్చింది. ఈ మార్పు గృహ కార్మికులకు కూడా వర్తిస్తుంది. వారికి 'ముసానెద్' ఇ-సర్వీస్ ప్లాట్ఫారమ్ ద్వారా కాంట్రాక్ట్ బదిలీలకు అవకాశం కల్పించారు. అంతేకాకుండా, వార్షిక సెలవులు, విశ్రాంతి దినాలు మరియు వేతన రక్షణకు హామీ ఇవ్వబడింది. కార్మికులకు స్వేచ్ఛ, గౌరవంతో కూడిన పని వాతావరణం కల్పించడం ద్వారా సౌదీ అరేబియా తమ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రద్దు నిర్ణయం చాలా పెద్ద ముందడుగు అయినప్పటికీ, ఈ సంస్కరణలు వాస్తవంగా అమలు జరిగేలా, కార్మికులపై దుర్వినియోగం లేకుండా చూడటానికి, పటిష్టమైన పర్యవేక్షణ, న్యాయ సహాయం అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యమని మానవ హక్కుల సంస్థలు నొక్కి చెబుతున్నాయి. సౌదీ అరేబియా ప్రభుత్వం కఫాలా వ్యవస్థను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం నిజంగా చరిత్రాత్మకం. ఈ చర్యతో లక్షలాది వలస కార్మికులకు ఉద్యోగాలు మారే స్వేచ్ఛ, దేశం విడిచి వెళ్లే స్వేచ్ఛ లభించాయి. అయినప్పటికీ, మానవ హక్కుల సంస్థలు మరియు కార్మిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ సంస్కరణలు మాత్రమే పూర్తి పరిష్కారం కాదు. పాత వ్యవస్థను వదిలించుకుని, కార్మికుల హక్కులను పూర్తిగా రక్షించాలంటే ఇంకా చాలా ముఖ్యమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నిబంధనలు మారినా, పాత వ్యవస్థలో అధికారం చేతిలో ఉన్న యజమానులు ఇప్పటికీ కార్మికులను ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. చట్టాలు కాగితంపై మాత్రమే ఉండి, ఆచరణలో అమలు కాకపోతే కార్మికులు మళ్లీ ఇబ్బందులు పడతారు. ఉదాహరణకు, కొత్త నిబంధనల ప్రకారం కార్మికుడు ఉద్యోగం మారాలంటే, అతను తన పాత ఉద్యోగ ఒప్పందాన్ని పూర్తి చేయాలి లేదా యజమానికి సరైన నోటీసు ఇవ్వాలి. ఈ సమయంలో కూడా, పాత యజమాని ఉద్దేశపూర్వకంగా కార్మికుడిపై అబద్ధపు ఆరోపణలు చేయడం, లేదా అతనిపై 'పారిపోయినట్లు' తప్పుడు రిపోర్ట్ ఇచ్చే అవకాశం ఉంది. ఈ తప్పుడు రిపోర్ట్ ఇస్తే, కార్మికుడి వీసా రద్దు చేయబడి, అతను దేశం నుంచి బహిష్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది. 'కఫీల్' (స్పాన్సర్) అనే పదం పోయినా, వారి చేతుల్లోని అధికారాలు పూర్తిగా పోలేదని దీని అర్థం.

అంతేకాక, గృహ కార్మికులకు సంబంధించిన 'ముసానెద్' వంటి కొత్త ఆన్లైన్ ప్లాట్ఫారమ్లు వచ్చినా, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన లేదా టెక్నాలజీ పరిజ్ఞానం తక్కువగా ఉన్న కార్మికులకు వాటిని ఎలా ఉపయోగించాలో, వాటి ద్వారా తమ హక్కులను ఎలా కాపాడుకోవాలో తెలియకపోవచ్చు. చాలా మంది కార్మికులు ఇప్పటికీ తమ యజమానులపై లేదా రిక్రూట్మెంట్ ఏజెంట్లపై ఆధారపడి ఉన్నారు. ఈ వ్యవస్థీకృత లోపాలను యజమానులు తమకు అనుకూలంగా మార్చుకోవచ్చు.

సంపూర్ణ విముక్తి సాధించాలంటే కేవలం కఫాలా వ్యవస్థను రద్దు చేస్తే సరిపోదు, ఆ సంస్కరణ నిజంగా విజయవంతం కావాలంటే ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. తప్పుడు రిపోర్టు ఇచ్చి కార్మికులను అన్యాయంగా వేధించే యజమానులపై భారీ జరిమానాలు విధించడం, కఠినమైన శిక్షలు అమలు చేయడం చాలా అవసరం. చట్టాలు కాగితంపై కాకుండా, ఆచరణలో పటిష్టంగా అమలు అయ్యేలా చూడాలి. అలాగే, కార్మికులకు సులభంగా మరియు ఉచితంగా న్యాయ సహాయం అందించే కేంద్రాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలి. ఈ కేంద్రాలలో ముఖ్యంగా కార్మికుల మాతృభాషలోనే ఫిర్యాదులు స్వీకరించడం, వారి తరపున కోర్టులలో వాదించడం వంటివి జరిగితేనే న్యాయం అందుబాటులోకి వస్తుంది.

మరొక ముఖ్యమైన విషయం, పాస్పోర్ట్ల రక్షణ. యజమానులు ఏ పరిస్థితుల్లోనూ కార్మికుల పాస్పోర్ట్లను స్వాధీనం చేసుకోకుండా నిరోధించాలి. దీనిపై కఠిన చట్టాలు అమలు చేసి, పాస్పోర్ట్లు తీసుకునే ప్రతి యజమానిని నేరస్తుడిగా పరిగణించాల్సిన అవసరం ఉంది. దీనితో పాటు, కొత్త చట్టాలు, హక్కులు మరియు బాధ్యతల గురించి కార్మికులకు, యజమానులకు కూడా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రతి కార్మికుడికి తమ హక్కుల గురించి స్పష్టంగా తెలిస్తేనే వారిని ఎవరూ మోసం చేయలేరు.

ఇక, గృహ కార్మికులకు ప్రత్యేక శ్రద్ధ అవసరం. వారు ఇతరుల ఇళ్లలో ఒంటరిగా ఉంటారు కాబట్టి, వారిని దోపిడీ నుంచి కాపాడటానికి ప్రత్యేకంగా పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వారికి కనిష్ట వేతనాలు, నిర్ణీత పని గంటలు మరియు వారపు విశ్రాంతి దినాలు ఉండేలా కచ్చితమైన నిబంధనలు పెట్టాలి. మొత్తంగా చెప్పాలంటే, కఫాలా వ్యవస్థ రద్దు అనేది ఒక గొప్ప ఆరంభం మాత్రమే. అయితే, వలస కార్మికులకు నిజమైన గౌరవం మరియు స్వేచ్ఛ లభించాలంటే, వ్యవస్థలో అధికారిక మార్పులు మాత్రమే కాకుండా, వాటిని నిజాయితీగా, పటిష్టంగా అమలు చేసే నిబద్ధత కూడా అవసరం. అప్పుడే, గల్ఫ్కు ఉపాధి కోసం వెళ్లే కోట్లాది మంది శ్రామికుల కల నెరవేరుతుంది.

# ప్రమాద ఘడియలు భారతావనికా?

- సవాళ్లు కేవలం సరిహద్దు భద్రతకే పరిమితం కాకూడదు
- దేశ అంతర్గత ఆర్థిక విధానాలు, సాంకేతిక స్వీకరణ
- ఆర్థికంగా తీసుకునే ప్రతి నిర్ణయం దేశ భవిష్యత్తును ప్రభావితం
- ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధ వాతావరణం భారత్ కి పెను సవాలు
- సరిహద్దు ఉగ్రవాదం, కశ్మీర్ ప్రాంతంలో అస్థిరతకు కారణమవుతోంది

తేజస్వి
హైదరాబాద్



ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధ వాతావరణం భారతదేశానికి పెను సవాలుగా మారింది. ముఖ్యంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచ సరఫరా వ్యవస్థ దెబ్బతింది, ఇది ఇంధనం, ఎరువులు మరియు ఆహార ధాన్యాల ధరలను పెంచింది. ఈ ద్రవ్యోల్బణం ప్రభావం భారత్పై కూడా పడింది. ఇటువంటి సంఘర్షణలు భారతదేశం యొక్క రక్షణ దౌత్యాన్ని సంక్లిష్టం చేస్తున్నాయి, ఒకవైపు పాశ్చాత్య దేశాలతో, మరోవైపు రష్యాతో సంబంధాలను సమతుల్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీనికి తోడు, భారతదేశం సరిహద్దుల్లో పాకిస్తాన్, చైనా వంటి పొరుగు దేశాల నుంచి నిరంతర ముప్పు పొంచి ఉంది. పాకిస్తాన్ వైపు నుంచి కొనసాగుతున్న సరిహద్దు ఉగ్రవాదం, కశ్మీర్ ప్రాంతంలో అస్థిరతకు కారణమవుతుండగా, చైనా వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి ) వెంబడి సైన్యాన్ని పెంచడం ద్వారా తీవ్ర ఉద్రిక్తత లను సృష్టిస్తోంది. ఈ బాహ్య సవాళ్లతో పాటు, దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్న నక్సలిజం వంటి అంతర్గత సాయుధ పోరాటాలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, ఆయా ప్రాంతాల అభివృద్ధికి అడ్డంకిగా మారాయి. ఈ నిరంతర భద్రతా ముప్పుల కారణంగా, భారత్ తన బడ్జెట్లో రక్షణ వ్యయాన్ని గణనీయంగా పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పెరిగిన వ్యయం, దేశంలో విద్య, ఆరోగ్యం వంటి సామాజిక అభివృద్ధి పథకాలకు కేటాయించాల్సిన నిధులను తగ్గించాల్సి వస్తుంది, తద్వారా దేశీయంగా అభివృద్ధి వేగాన్ని తగ్గిస్తుంది. రక్షణ బడ్జెట్ పెరుగుదల మరియు అంతర్జాతీయ అస్థిరత కారణంగా దేశ విదేశీ మారక నిల్వలపై కూడా ఒత్తిడి పెరుగుతుంది. ఏ క్షణంలోనైనా తలెత్తే అనూహ్య పరిస్థితుల కోసం భారత్ సిద్ధంగా ఉండాల్సి వస్తుంది, ఇది ఆర్థిక ప్రణాళికలను ప్రభావితం చేస్తుంది.

**క్రిప్టోకరెన్సీపై భారత వైఖరి:** ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు క్రిప్టోకరెన్సీల వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ, భారతదేశం మాత్రం దీనిని పూర్తిగా అంగీకరించకుండా, లేదా స్పష్టమైన నియంత్రణ విధానం లేకుండా అనిశ్చిత వైఖరిని కొనసాగిస్తోంది. ఈవిధానం వల్ల దేశం కొన్ని ముఖ్యమైన ఆర్థిక మరియు సాం కే తిక నష్టాలను ఎదుర్కొంటోంది. క్రిప్టోకరెన్సీలు, బ్లాక్చెయిన్టెక్నాలజీ అనే ది ప్రపంచ ఆర్థిక రంగంలో వేగంగా వృద్ధి చెందుతున్న విభాగం.భారత్ ఈ విధానంలో ఆలస్యం చేయడం వలన, క్రిప్టో రంగంలో పెట్టుబడులు పెట్టాలనుకునే భారతీయ ఆవిష్కర్తలు మరియు పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను, నిధులను విదేశాలకు తరలించుకుంటున్నారు. దీనివల్ల దేశం విలువైన పెట్టుబడులతో పాటు, సాంకేతిక ప్రతిభను కూడా కోల్పోతోంది. ఇతర దేశాలు క్రిప్టో లావాదేవీలపై పన్నులు విధించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకుంటుంటే, భారత్ మాత్రం స్పష్టత లేకపోవడం వలన ఆ ఆదాయ మార్గాన్ని కూడా వదులుకుంటోంది. సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకోవడంలో భారత్ వెనుకబడిపోయే ప్రమాదం ఉంది. ఈ అనిశ్చితి కారణంగా ఫైనాన్షియల్ టెక్నాలజీ రంగంలో భారత్ ప్రపంచ నాయకత్వ స్థానానికి చేరుకునే అవకాశాన్ని కోల్పోతోంది. క్రిప్టో ఆస్తులను ఉపయోగించి సరిహద్దులు దాటి జరిగే వ్యాపారాలు, డిజిటల్ చెల్లింపుల వంటి కొత్త ఆర్థిక పద్ధతులలో భారత్ పాల్గొనలేకపోవడం భవిష్యత్తులో దేశీయ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రధాన అవరోధంగా మారుతుంది. ముఖ్యంగా, క్రిప్టో మార్కెట్లో ఉండే పెద్ద మొత్తంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను భారత్ ఆకర్షించలేకపోతోంది.

**అమెరికాతో టారిఫ్ పోరాటం:** అమెరికాతో టారిఫ్ పోరాటం అనేది భారతదేశం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన ఆర్థిక సవాలు. వస్తువుల దిగుమతిపై సుంకాలను పెంచడం ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు ప్రభావితమవుతున్నాయి. గతంలో అమెరికా భారతదేశానికి కల్పించిన కొన్ని ముఖ్యమై న వాణిజ్య రాయితీలనురద్దు చేసింది.దీని ఫలితంగా, భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై దిగుమతి సుంకాలు పెరిగిపోయాయి. ఈ టారిఫ్ పోరాటం భారతీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. అమెరికన్ మార్కెట్లో భారతీయ వస్తువుల ధరలు పెరిగి, అవి అంతర్జాతీయంగా పోటీపడే సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. ఎగుమతులు తగ్గడం వలన దేశంలో తయారీ రంగం మందగించడం, ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయవాణిజ్య యుద్ధ వాతావరణంలో, భారతదేశం కేవలం అమెరికాపైనే కాకుండా, ఇతర దేశాలపై కూడా ఆధారపడటాన్ని తగ్గించుకుంటూ, కొత్త వాణిజ్య ఒప్పందాలను చురుకుగా చేసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా, చిన్న, మధ్య తరహా ఎగుమతిదారులు ఈ టారిఫ్ల పెరుగుదల వలన తీవ్రంగా ప్రభావితమవు తున్నారు.సుంకాలు పెరిగితే, కొత్తమార్కెట్లను కనుగొనడం లేదా తమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడం కష్టమవుతుంది. ఈ పరిస్థితి దేశంలోని ఉద్యోగాల సృష్టిపై మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం చూపు తుంది. అమెరికా నుండి దిగుమతి చేసుకునే కొన్ని ఉత్పత్తులపై భారత్ కూడా ప్రతీకార టారిఫ్లు విధించడం వలన దేశీయ పరిశ్రమలకు ముడి సరుకు ఖర్చు లు పెరిగిపోయి, అంతిమంగా వినియోగదారుడిపై ధరల భారం పడుతుంది.

> *ప్రపంచ వేదికపై శక్తివంతమైన దేశంగా ఎదుగుతున్న భారతదేశం ప్రస్తుతం అనేక క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సవాళ్లు కేవలం సరిహద్దు భద్రతకే పరిమితం కాకుండా, దేశ అంతర్గత ఆర్థిక విధానాలు, సాంకేతిక స్వీకరణ మరియు అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల వరకు విస్తరించి ఉన్నాయి. వ్యూహాత్మకంగా మరియు ఆర్థికంగా తీసుకునే ప్రతి నిర్ణయం దేశ భవిష్యత్తును ప్రభావితం చేయనుంది. భద్రత, ఆర్థిక స్థిరత్వం, సాంకేతిక పురోగతి వంటి ముఖ్యమైన అంశాలలో భారత్ తన నిబద్ధతను నిరూపించుకోవాల్సిన సమయం ఇది.*

**అమెరికా ఒత్తిడి: చమురు, ఆయుధాలు, వాణిజ్యం :** ప్రపంచ రాజకీయాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ, భారతదేశం ప్రస్తుతం అమెరికా నుంచి బహుళ రంగాల్లో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ ఒత్తిడి భారతదేశ సార్వభౌమాధికారం , రక్షణ మరియు ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఒకేసారి చమురు కొనుగోళ్ళు, వ్యవసాయ వాణిజ్యం, రక్షణ ఒప్పందాలు మరియు అంతర్గత రాజకీయాలపై అమెరికా పెంచుతున్న జోక్యం భారతదేశానికి అతిపెద్ద ప్రమాద ఘంటికగా మారింది.అంతర్జాతీయంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తక్షణమే నిలిపివేయాలని అమెరికా భారతదేశంపై గట్టిగా ఒత్తిడి చేస్తోంది. ఈ విషయంలో భారతదేశం 'అవును' అన్నా, 'కాదు' అన్నా దేశానికి ప్రమాదమే.ఒకవేళ 'అవును' అంటే, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపివేస్తే, చమురు కోసం పశ్చిమ దేశాలు మరియు ఇతర మార్కెట్లపై ఆధారపడాల్సి వస్తుంది. ఇది భారతదేశానికి చమురు కొనుగోలు వ్యయా న్ని భారీగా పెంచు తుంది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి, ద్రవ్యోల్బణం మరింత తీవ్రమవుతుంది. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.ఒకవేళ 'కాదు' అంటే, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే, అమెరికా నుంచి 'ప్రతీకార చర్యలు' లేదా ఆర్థిక ఆంక్షలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఈ ఆంక్షలు బ్యాంకింగ్ లావాదేవీలు, అంతర్జాతీయ వాణిజ్యాన్ని అడ్డుకోవచ్చు, ఇది భారత దేశ అంతర్జాతీయ వాణిజ్యానికి, డాలర్-ఆధారిత ఆర్థిక లావాదేవీలకు పెద్ద ముప్పుగా మారుతుంది.

**అ)వ్యవసాయ రంగం:** భారత్ చమురు విషయంలో అమెరికాకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే, ఆతర్వాత అమెరికా తమ వ్యవసాయ ఉత్పత్తులను భారత మార్కెట్లో దిగుమతి చేసుకునేందుకు వాణిజ్య ఒప్పందం చేయాలని డిమాండ్ చేయవచ్చు. ఇక్కడే భారతదేశానికి పెద్ద నష్టం ఉంది.అమెరికాలో వ్యవసాయం పూర్తిగా యంత్రాలపై ఆధారపడి ఉంటుంది, దీనివల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి చేయగలరు. కానీ భారతదేశంలో వ్యవసాయం ప్రధానంగా లక్షలాది మంది శ్రామికులపై ఆధారపడి ఉంది. అమెరికన్ ఉత్పత్తులు భారత మార్కెట్లోకి చవకగా వస్తే, మన దేశీయ వ్యవసాయ ఉత్పత్తులు, ముఖ్యంగా చిన్న రైతుల పంటలు, వాటితో పోటీపడలేవు. దీనివల్ల భారతీయ రైతులు తీవ్రంగా నష్టపోతారు, వ్యవసాయ రంగంలో ఉపాధి కోల్పోయి, దేశంలో గ్రామీణ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది.

**ఆ )రక్షణ కొనుగోళ్లపై నియంత్రణ:** చమురు మరియు వ్యవసాయ రంగాల తర్వాత, అమెరికాదృష్టి భారతదేశ రక్షణ వ్యవస్థ వైపు వెళ్ళే అవకాశం ఉంది. రష్యా వంటి ఇతర దేశాల నుంచి ఆయుధాలు కొనుగోలు చేయడాన్ని ఆపివేయాలని, కేవలం అమెరికా నుంచే ఆయుధాలను కొనుగోలు చేయాలని అది డిమాండ్ చేసే అవకాశం ఉంది.భారత్ తన రక్షణ అవసరాల కోసం చారిత్రక భాగస్వామి అయిన రష్యా సహా ఇజ్రాయెల్, ఫ్రాన్స్ వంటి వివిధ దేశాలపై ఆధారపడి ఉంది. అన్ని ఆయుధాలను ఒకే దేశం (అమెరికా) నుంచి కొనుగోలు చేయడం వలన రక్షణ రంగంలో స్వయంప్రతిపత్తికోల్పోయే ప్రమాదం ఉంది. ఏ భవిష్యత్తు వివాదంలోనైనా, అమెరికా ఆయుధాల సరఫరాను లేదా విడిభాగాల సరఫరాను ఆపివేస్తే, అది దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరంగా మారుతుంది.

**ఇ)కాశ్మీర్ అంశంలో జోక్యం ముప్పు :** అంతర్జాతీయ వ్యవహారాలలో జోక్యం చేసుకునే అమెరికా ధోరణిని పరిగణనలోకి తీసుకుంటే, అది భారతదేశంలోని జమ్మూ-కాశ్మీర్ అంశంలో కూడా జోక్యం చేసుకునే ప్రమాదం ఉంది. గతంలో భారత్-పాకిస్తాన్ మధ్య ఉన్న ద్వైపాక్షిక సమస్య అయిన కాశ్మీర్ విషయంలో, మధ్యవర్తిత్వం చేయడానికి లేదా శాంతిచర్చల పేరుతో జోక్యం చేసుకోవ డానికి అమెరికా ప్రయత్నించవచ్చు.జమ్మూ-కాశ్మీర్ అనేది భారతదేశ అంతర్గత వ్యవహారం. ఇందులో ఏవిదేశీ శక్తి జోక్యం చేసుకోవడాన్ని భారత్ అంగీకరించ దు. ఒకవేళ అమెరికా బలవంతంగా ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని ప్రయత్నిస్తే, అది భారతదేశ సార్వభౌమాధికారాన్ని మరియు అంతర్గత రాజకీ య స్థిరత్వాన్ని సవాలు చేసినట్లు అవుతుంది.

**ఈ)పాకిస్తాన్తో ఒప్పందాల డిమాండ్**ఆ తర్వాత కేవలం తమఉత్పత్తులను కొనుగోలు చేయమని డిమాండ్ చేయడమే కాకుండా, అమెరికా తమ వ్యూహా త్మక ప్రయోజనాల కోసం పాకిస్తాన్తో కొన్ని ఒప్పందాలు చేసుకోవాలని కూడా భారత్ను కోరవచ్చు.ఉదాహరణకు, చమురు లేదా రక్షణ ఆయుధాల కొనుగోలుపై పెద్ద ఒప్పందం చేసుకునేందుకు బదులుగా, భారతదేశం తమ ఉత్పత్తులను పాకిస్తాన్తో పంచుకోవడానికి లేదా పాకిస్తాన్తో దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవడానికి అంగీకరించాలని డిమాండ్ చేయవచ్చు. ఇటువంటి షరతులు భారతదేశం యొక్క భద్రతా వ్యూహాలకు మరియు ప్రాదేశిక సమగ్రతకు విఘాతం కలిగిస్తాయి. ఈ డిమాండ్లు భారతదేశ విదేశాంగ విధానాన్ని మరియు రక్షణ వ్యూహాన్ని అమెరికా అజెండాకు అనుగుణంగా మార్చుకోవాలని ఒత్తిడి చేయడమే. ఈ ఒత్తిడికి తలొగ్గితే, దేశ ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని పణంగా పెట్టినట్లు అవుతుంది.

(మిగతా రేపటి సంచికలో)

# భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలతోప్రపంచ ఆర్థికవ్యవస్థ కుదేలు



డాక్టర్. పి.ఎస్. చారి
8309082823

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు అనేపదం అంతర్జాతీయ సంబంధాలలో విస్తృత, విశ్లేషణాత్మక పరిధిని సూచిస్తుంది, రాజకీయ అస్థిరత, దేశాల మధ్య ఉద్రిక్తతలు, సైనిక సంఘర్షణలు, ఉగ్రవాద బెదిరింపులు, ప్రాంతీయ లేదా ప్రపంచ ప్రభావాలను కలిగి ఉండే భౌగోళిక సంఘటనలు వంటి విభిన్న విషయాలను కలిగిఉంటుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తరచుగా ప్రాదేశిక వివాదాలు, సైనిక చర్యలు, విరుద్ధమైన పొత్తులు, వాణిజ్య యుద్ధాలు, ఇంధన వనరులపై పోటీ వంటి అంశాల కలయిక నుండి ఉత్పన్నమవుతాయి. దక్షిణ చైనా సముద్రం, కాశ్మీర్ వంటివివాదాలు సరిహద్దుల దీర్ఘకాలిక పోటీలకు ఎలా కారణమవుతాయో తెలియచేస్తాయి .అయితే సైనిక కార్యకలాపాలు - రష్యన్ సరిహద్దుల దగ్గర నాటNorth Atlantic Treaty Organisation) ఉనికి వంటివి ప్రాంతీయ అభద్రతను పెంచుతాయి. అమెరికా - ఇరాన్ మద్దతు గల దేశాల మధ్య ఉన్న విరుద్ధమైనపొత్తులు, ప్రపంచ సంబంధాల ను మరింత క్లిష్టతరంచేస్తాయి, వాణిజ్యయుద్ధాలు, ఆంక్షలువంటిఆర్థికచర్యలుఅమెరికా-చైనా వాణిజ్య వివాదం ద్వారా తెలుస్తున్నవి.. ఐరోపాకు రష్యా గ్యాస్ సరఫరా వంటి కీలకమైన ఇంధన వనరులు, పైప్ లైన్లపై నియంత్రణ తరచుగా రాజకీయ పరపతికి సాధనంగా పని చేస్తుంది. సరిహద్దులు దాటే జాతి, మత ఘర్షణలు కూడా అస్థిరతను పెంచుతాయి .తూర్పు ఐరోపాలో నాటో విస్తరణ ప్రభావంపై వివాదాల కారణంగా రష్యా-ఉక్రెయిన్ వివాదం, సార్వభౌమాధికారం అంతర్జాతీయ ప్రమేయంపై చైనా -తైవాన్ ల మధ్య కేంద్రీకృతమైన సమస్య, వ్యూహాత్మక, మతపరమైన, ఇంధన సంబంధిత సమస్యలపై ఇజ్రాయెల్, ఇరాన్, సౌదీ అరేబియా, సంక్లిష్టమైన మధ్యప్రాచ్య వివాదాలు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు ప్రముఖ ఉదాహరణలు.

భౌగోళిక రాజకీయాలు ఆర్థిక పనితీరును ఎలా ప్రభావితంచేస్తాయి? ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిత్యం వాణిజ్యం, వస్తువుల ధరల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా భౌగోళిక రాజకీయ సంఘటనల ద్వారా తీవ్రంగా ప్రభావితమవుతుంది. మూలధన నియంత్రణలు, ఆర్థిక ఆంక్షలు వంటి చర్యల ద్వారా, అలాగే పెరిగిన అనిశ్చి తి, ధరల అస్థిరత ద్వారా ఆర్థిక మార్కెట్లు ప్రభావితమవుతాయి. దేశాల మధ్య పెరుగుతున్నఉద్రిక్తతలు తరచుగా ప్రపంచ సరఫరా గొలుసులు (Supply Chain), వాణిజ్య ప్రవాహాలను అంతరాయంకు దారితీస్తాయి, ఇటు వంటి అంతరాయాలు వస్తువుల ధరలను పెంచుతాయి చమురు, గ్యాస్ వంటి ముఖ్యమైన వనరుల కొరతకు కారణమవుతాయి, తద్వారా ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక ఉత్పత్తి తగ్గుతుంది. ఫలితంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత కాలంలో అధిక ద్రవ్యోల్బణం, నెమ్మదిగా ఆర్థికవృద్ధి, గణనీయమైన సంక్షేమ నష్టాలు సంభవిస్తాయి. అంతే కాకుండా, ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రాధాన్యతల ఆధారంగా ఆర్థికవిధానాలు, పన్నులు ఖర్చుల ద్వారా ఆర్థిక కార్యకలాపాలను రూపొందిస్తున్నందున, భౌగోళిక రాజకీయాలు అంతర్గత రాజకీయ వ్యవహారాలను ప్రభావితం చేస్తాయి. జనాదరణపెరుగుదల దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని మరింత బెదిరిస్తుంది, ఎందుకంటే జనాదరణ పొందిన ప్రభుత్వాలు తరచుగా వాణిజ్య రక్షణ వాదం, ఆర్థిక విస్తరణ వంటి స్వల్పకాలిక, స్థిరమైన విధానాలను అవలంబిస్తాయి, ఇవి ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీస్తాయి, అస్థిరతను పెంచి వృద్ధిని అడ్డుకుంటాయి. 1990-2020 మధ్య 60 దేశాల అధ్యయనం నుండి వచ్చిన అనుభవ ఆధారాలు జనాదరణ పొందిన ప్రభుత్వాలు మధ్యస్థ , దీర్ఘకాలికంగా తక్కువ ఉత్పత్తి, వాస్తవతలసరివృద్ధి (Real Percapita growth) తో సంబంధం కలిగి ఉన్నాయని సూచిస్తున్నది. దీనికి విరుద్ధంగా, ఆర్థిక ఫలితాలు రాజకీయాలను బలంగా ప్రభావితం చేస్తాయి: బలమైనవృద్ధి, తక్కువ నిరుద్యోగం, స్థిరమైన ద్రవ్యోల్బణం సాధారణంగా అధికారంలో ఉన్నవారిని బలపరుస్తాయి, అయితే అధిక ద్రవ్యోల్బణం లేదా నిరుద్యోగం వంటి ఆర్థిక ఇబ్బందులు అసంతృప్తిని రేకెత్తిస్తాయి.

భౌగోళిక- రాజకీయ ఉద్రిక్తతలు- ఆర్థికప్రభావం 2024లో ప్రపంచం ఎదుర్కొన్న ప్రధాన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలలో చాలా వరకు కొనసాగుతున్న సంఘర్షణలు, లోతుగా పాతుకుపోయిన ఉద్రిక్తతల నుండి ఉత్పన్న మయినవే.. 2024 లో ఉద్రిక్తతల యొక్క ప్రపంచ ఆర్థికప్రభావం 19.97 ట్రిలియన్ల డాలర్లకు చేరుకుంది, ఇది ప్రపంచ స్థూలదేశీయోత్పత్తిలో 11.6%కి సమానం. సైనిక వ్యయం మాత్రమే 2.7 ట్రిలియన్ల డాలర్లు .2023లో ఉద్రిక్తతల ఖర్చు 19.1 ట్రిలియన్ల డాలర్లు లేదా ప్రపంచ స్థూలదేశీయోత్పత్తిలో 13.5%. 2021-22 లో ఉద్రిక్తతల ఖర్చు 16.5 ట్రిలియన్ల డాలర్లు., ఇది ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో 10.9%.యుద్ధం ఫలితంగా ఉక్రెయిన్ 2022లో దాని ఆర్థికవ్యవస్థ దాదాపు 30% కుంచించుకుపోయింది. 2022 అక్టోబర్లో అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) బ్లాగ్, ప్రపంచవ్యాప్తంగా రెండు వాణిజ్యసంఘాలు గా విభజించడం వల్ల ఆసియా, పసిఫిక్ ప్రాంతంలోని దేశాలకు స్థూల దేశీయోత్పత్తిలో 3% కంటే ఎక్కువ శాశ్వత వార్షిక నష్టాలు సంభవిస్తాయని హెచ్చరించింది. ఒక అంచనా ప్రకారం వాణిజ్య సంఘర్షణలు ఆగ్నేయాసియాలో ప్రాంతీయ స్థూలదేశీయోత్పత్తిని 11.1% మరియు ఉపాధిని 25% తగ్గించవచ్చు. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారమే లెబనాన్, మధ్యప్రాచ్యంలోని కొన్ని సంఘర్షణ బాధితదేశాలు స్థూల దేశీయోత్పత్తిలో 50 % కంటే ఎక్కువ ఉత్పత్తి నష్టాలను చవిచూశాయి. పొరుగు దేశాల దీర్ఘకాల దిగ్బంధనం అర్మేనియా ఆర్థికవ్యవస్థకు దాని ఉత్పాదకత/ఉత్పత్తిలో 30-40% నష్టం కలిగించిందని అంచనా. రష్యా-ఉక్రెయిన్ యుదసంఘర్షణ నుండి జర్మనీ స్థూల దేశీ-యోత్పత్తి నేరుగా 1.1 శాతం పాయింట్లు తగ్గింది. 2019లో, ఇన్స్టిట్యూట్ ఆఫ్ఏ కనామిక్స్ %డ% పీస్ నివేదిక ప్రకారం, దక్షిణాసియాలో హింస యొక్క ఆర్థిక ప్రభావం భారతదేశంలోనే 991.2 బిలియన్ల డాలర్లు. డెజర్వ్ చేసిన విశ్లే షణ ప్రకారం, 2025 మేనెలలో స్వల్పంగా ఉద్రిక్తతలు పెరగడం వల్ల భారతదేశానికి కేవలం నాలుగురోజుల్లోనే 519 మిలియన్ల డాలర్ల నుండి 1.78 బిలియన్ల డాలర్ల వరకు నష్టం వాటిల్లింది.

రాబోయే దశాబ్దంలో రాజకీయ ఉద్రిక్తతల ప్రభావఅంచనాలు అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF), ఆర్థికసహకార అభివృద్ధి సంస్థ(OECD ),లండన్కు చెందిన లాయిడ్స్ (Lloyds) ఇటీవలి అంచనాల ప్రకారం, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు రాబోయే దశాబ్దంలో ప్రపంచ ఆర్థికవృద్ధిని గణనీయంగా దెబ్బతీయవచ్చు .ప్రపంచ ఆర్థికవ్యవస్థ పోటీకూటములుగా విడిపోతే ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి దీర్ఘకాలికంగా 1-2% తగ్గవచ్చు. వాణిజ్య విచ్ఛిన్నం ప్రపంచ వాణిజ్యాన్నిదాదాపు 18% తగ్గించగలదని, కొన్ని దేశాలలో 12% వరకు స్థూల దేశీయోత్పత్తి నష్టాలను కలిగిస్తుందని %రాజుజణ% హెచ్చరిస్తుంది. వాణిజ్య అంతరాయాలు లేదా ప్రాంతీయ సంఘర్షణలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఐదు సంవత్సరాలలో 14.5 ట్రిలియన్ల అమెరికా డాలర్ల వరకు నష్టపోవచ్చని లాయిడ్అంచనావేసింది. సబ్-సహారా ఆఫ్రికా ప్రాంతం ఒకే దేశం కాకపోయినా, భౌగోళిక రాజకీయ విచ్ఛిన్నం పెరిగితే ఈప్రాంతం 10 సంవత్సరాలలోవాస్తవ స్థూల దేశీయోత్పత్తిలో 4% వరకు శాశ్వత స్థూల దేశీ-యోత్పత్తి క్షీణతను ఎదుర్కొంటుందని అంచనా. ఈసంఘర్షణ-ఆధారిత బెదిరింపులకు మించి, నియంత్రించబడని శక్తివంతమైన కృత్రిమమేధస్సు (AI) సాంకేతికతలు, కీలకమైన ఖనిజాల వాణిజ్యానికి అంతరాయం కలిగించే రక్షణవాదం , నిరంతర స్థూల ఆర్థిక, ఆర్థిక దుర్బలత్వాల నుండి ప్రపంచం కొత్తసవాళ్లను ఎదుర్కొంటుంది. కఠినమైన ద్రవ్యవిధానం కారణంగా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి ప్రమాదం పెరుగుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

భౌగోళిక రాజకీయ సంఘటనల వల్ల కలిగే ముప్పులు చాలా వాస్తవమైనవే అయినప్పటికీ, సానుకూల పరిణామాలు కూడా ఉన్నాయి. దశాబ్దాలలో అత్యంత దూకుడుగా ఉన్న ద్రవ్య విధాన కఠినత ఒక దానికి గురైనప్పటికీ ప్రధాన ఆర్థికవ్యవస్థలు అద్భుతమైన స్థిరత్వంను ప్రదర్శించాయి .చైనా ఆర్థికవ్యవస్థ గతంలో ఊహించిన దాని కంటే త్వరగా కోలుకోవచ్చు. అంతేకాకుండా, కృత్రిమమేధస్సు(ఆర్టిఫిషియల్ఇంటెలిజెన్స్) లోపురోగతులు ఆవిష్కరణలను, గణనీయమైనఉత్పాదకతలాభాలను అందించే సామర్థ్యాన్నికలిగి ఉన్నాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు ఇంకా చమురు ధరలపెరుగుదలకు దారితీయలేదు, ఇదిప్రపంచ మార్కెట్లకు కొంత ఉపశమనం కలిగిస్తుంది. మొత్తం మీద, భౌగోళిక రాజకీయ నష్టాల ప్రభావం మొదట్లో భయపడి నంత తీవ్రంగా ఉండకపోవచ్చు. అయినప్పటికీ, ప్రపంచస్థిరమైన వృద్ధి, ఉమ్మడి శ్రేయస్సును పెంపొందించడానికి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను తగ్గించడం చాలా అవసరం. వివాదాలను శాంతియుతంగా పరిష్క రిం చడానికి, విభేదాలు పెరగకుండా నిరోధించడానికి దేశాల మధ్య బహిరంగ సంభాషణ, దౌత్యం, సహకారం అవసరం. అంతర్జాతీయ సంస్థలను బలోపేతం చేయడం, న్యాయమైన వాణిజ్యం, పారదర్శకత, పరస్పర గౌరవాన్ని ప్రోత్సహించడం దేశాల మధ్య నమ్మకాన్నిపునర్నిర్మించడంలో సహాయపడు తుంది. బహు పాక్షిక భాగస్వామ్యాలు, సంఘర్షణ పరిష్కార విధానాల వల్ల సమిష్టి పురోగతి దెబ్బతినదు.అంతిమంగా, స్థిరమైన భౌగోళిక రాజకీయ వాతావరణం దేశాలు ఆవిష్కరణ, అభివృద్ధిపై దృష్టి పెట్టడానికి, వాతావరణ మార్పు, అసమానత వంటి ప్రపంచ సవాళ్లను కలిసి ఎదుర్కోవడానికి దోహదం చేస్తుంది.

## విషాదపు ప్రయాణం

నిన్న కర్నూలులో జరిగిన ట్రావెల్స్ బస్సు రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాల విషాదం మన మనసుల్ని వెంటాడుతూనే ఉంటుంది. నిద్రా, లేక నిర్లక్ష్యమా ఏది ఇంతమంది సజీవ దహనంతో అయినవాళ్ళందరినీ కోల్పో యిన కొన్ని కుటుంబాలను రోడ్డు ప్రమాదం కారణంగా రోడ్డున పడేసిం ది? ట్రావెల్స్ బస్ లగేజి బాక్స్లో వందల సెల్ ఫోన్లు ఉండి అవి పేలడం వల్ల ప్రమాద తీవ్రత ఎక్కువైందని కొన్ని పేపర్లు రాశాయి. దీన్ని బట్టి బస్ సిబ్బంది ప్రయాణికులు ఏం క్యారీ చేస్తున్నారో కూడా పట్టించుకోవాలి కదా! ఎప్పుడూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా వ్యవస్థల నిర్లక్ష్యాన్ని గమనించని ప్రయాణికులు అప్రమత్తంగా లేకపోవడం ఇంకా ఇంకా ప్రమాదాలు జరగడానికి కారణమవుతున్నాయి. టైమ్స్ ఇండియా లెక్కల ప్రకారం 2023 లో రాష్ట్రంలో సుమారు 20 వేలకు పైగా యాక్సిడెంట్స్ జరిగితే 8 వేలకు పైగా అందులో మరణించారు. ప్రమాదాల్లో బయటపడుతున్న వారి సంఖ్య 60 శాతం మాత్రమే. 2017 సంఎలో జరిగిన యాక్సిడెంట్స్ కూడా ఎక్కువే. ఆ సంవత్సరంలో ప్రాణనష్టం ఎక్కువ కాగా అందులో బస్ యాక్సిడెంట్సే ఎక్కువ. 2022 సంఎలో బస్సు ప్రమాదాల కారణంగా హైదరాబాద్లో 13% మరణాలు సంభవించాయి. దేశవ్యాప్తంగా గణాంకాల జోలికి వెళితే లెక్కలు మన ఊహకు అందవు. ఇవన్నీ మనం మనరోడ్డు ప్రయాణాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేస్తున్నాయి. మితిమీరిన వేగ నియంత్రణకు పర్యవేక్షణ లేకపోడవం, దూర ప్రయాణాల్లో డ్రైవర్లకు విశ్రాంతి లేని అలసటతో పాటు, సామర్థ్యాలు కోల్పోయిన వాహనాల విచ్చలవిడి వినియోగం, టూ వీలర్స్, కార్లు, లారీలు, బస్సుల్లో చాలామంది తాగిన మత్తులో వాహనాలు నడపడం, ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కొన్ని కాలం చెల్లిన బస్సులు రంగులు పూసి ముస్తాబుతో కనబడుతున్నా సర్వీసింగ్, టైర్లు, బ్రేకులు, లైట్లు, స్టీరింగ్, సీటింగ్ కెపాసిటి వంటి సాంకేతిక అంశాల గురించి సిబ్బంది పట్టించుకోకపోవడంఒకటి. ప్రయాణికులు ప్రాణాలను కూడా లెక్క చేయకుండా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న రాత్రిపూట ప్రయాణానికి ప్రాధాన్యతనివ్వడం మరొకటి. అనేక చోట్ల వర్షపు నీటితో కనపడని రోడ్డుపైనున్న గుంటలు, డిమ్లైట్స్ వాడకుండా ముఖాలపై పడుతున్న లైట్ల ఫోకస్లో ఎదురుగా ఏవాహనం వస్తుందో గుర్తుపట్టలేక పోవడం కూడా ప్రమాదానికి కారణమే. రానురాను ప్రయాణమంటే ప్రమాదంగా మన ప్రాణాన్ని వేరే వాళ్ళ చేతుల్లో పెట్టడమే అవుతోంది. ఇవన్నీ కొంతైనా నిరోధించాలంటే గత ప్రమాదాల వివరాలపైన, విధ్వంసాలపైన ప్రతి డ్రైవర్కు, ప్రయాణికుడికి అవగాహన కల్పించాలి. జిల్లాల వ్యాప్తంగా డ్రైవర్లకు, ప్రజలకు రోడ్ సేఫ్టీ ట్రైనింగ్ క్యాంపులు ప్రతి నెల నిర్వహించాలి. అన్నిరకాల వాహనాలకు జి.పి.ఎస్. మానిటరింగ్ ద్వారా ముఖ్యంగా రాత్రిపూట స్పీడ్ రూట్ ట్రాకింగ్ గవర్నెన్స్ తప్పనిసరిగా ఉండాలి. సీటు బెల్టులు తప్పనిసరి చేయాలి. వేగ నియంత్రణ స్పీడ్ బ్రేకర్లు ఎక్కువగా ఏర్పాటు చేయాలి. ప్రమాద సమయంలో అద్దాలు పగలకొట్టుకుని బయటకు వచ్చేందుకు హెమరేజ్ టూల్స్ ఖచ్చితంగా ఉండాలి. బస్సుల్లో టి.వి. సినిమాలకు బదులు అవగాహన కల్పించే ఆడియో మెస్సేజ్లు, "జాగ్రత్తగా ప్రయాణించండి..

- జోస్యుల వేణుగోపాల్,
9440436806

# బిజినెస్

## ఐటీసీ హోటల్స్ కొత్త ప్రీమియం బ్రాండ్ ప్రారంభం

ఐటీసీ హోటల్స్ లిమిటెడ్ కొత్త ప్రీమియం బ్రాండ్ 'ఎపిక్ కలెక్షన్' ను ప్రారంభించింది. ఈ బ్రాండ్ యొక్క మొదటి రెండు హోటల్స్ ఒడిశా మరియు ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి దశలో ఉన్నాయి. పూరి లోని ఎపిక్ కలెక్షన్ హోటల్ 118 గదులుగా, తిరుపతి హోటల్ 201 గదులుగా ఉండగా, ఈ హోటల్స్ త్వరలో క్లబ్ ఐటీసీ రివార్డ్స్ ప్రోగ్రామ్ లో చేరనున్నాయి. ఈ కొత్త బ్రాండ్ ద్వారా మధ్యకాలంలో సుమారు 1,000 గదులు జోడించడం లక్ష్యం.'ఎపిక్ కలెక్షన్' ద్వారా ఉన్నతమైన, ప్రాంతీయ సాంస్కృతిక సంపదతో కూడిన అతిథి అనుభవాలను అందించడం లక్ష్యం. బ్రాండ్ ప్రతీ హోటల్ యొక్క ప్రత్యేకత, డిజైన్, స్వభావం మరియు ఆతిథ్యానికి ఉన్నతమైన ఉష్ణతను ప్రతిబింబిస్తుంది. ఐటీసీ హోటల్స్ సాంప్రదాయ ఆహార వంటకాలు, ఆధునిక పద్ధతుల ద్వారా స్థానిక భోజనాలను ప్రస్తావిస్తూ, ప్రీమియం అతిథి అనుభవాలను కలిగించడమే ఈ బ్రాండ్ లక్ష్యం.

ఈ బ్రాండ్ ఆధునికత మరియు సాంప్రదాయ విలువలను సమన్వయపరుస్తూ, ఉన్నత సేవా ప్రమాణాలను ప్రతిబింబిస్తుంది. ఇప్పటికే ఉన్న ప్రీమియం హోటల్స్ ను మారుస్తూ, ఐటీసీ హోటల్స్ యొక్క నెట్వర్క్ లో చేరించడం ద్వారా బ్రాండ్ పరిధిని విస్తరించడం జరుగుతుంది. 'ఎపిక్ కలెక్షన్' ద్వారా విభిన్న గోచరమైన, ప్రదేశానికి అనుగుణమైన ప్రీమియం అతిథి అనుభవాలను అందించడమే కంపెనీ యొక్క ప్రధాన ధ్యేయం.

'ఎపిక్ కలెక్షన్' ద్వారా ఐటీసీ హోటల్స్ పునర్నిర్మాణం మరియు పునరుపయోగం చేసే అవకాశాలను కూడా విస్తరిస్తుంది. ఇప్పటికే ఉన్న హోటల్స్ ను బ్రాండ్ ప్రమాణాలకు అనుగుణంగా మార్చడం ద్వారా, ఆ హోటల్స్ ప్రత్యేకత మరియు విలక్షణతను కలిగి ఉండగా, ప్రీమియం అతిథి అనుభవాలను మరింత సమృద్ధిగా అందిస్తాయి. ప్రతి హోటల్ స్థానిక సాంస్కృతిక ప్రతిధ్వనిని ప్రతిబింబిస్తూ, విభిన్నంగా, కానీ ఐక్యమైన ప్రీమియం బ్రాండ్ గుర్తింపును అందిస్తుంది.అంతేకాక, ఈ బ్రాండ్ ద్వారా సుస్థిరత, పర్యావరణ అనుకూలత మరియు 'జవాబుదారీ విలాసం' కంటే ముందుగా ఉండే విలువలను ప్రాధాన్యం ఇస్తుంది.

### బ్యాంకింగ్ కనెక్ట్ ద్వారా ప్రీమియం చెల్లింపులు ప్రారంభం

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ తన వినియోగదారుల కోసం కొత్త డిజిటల్ చెల్లింపు అనుభవాన్ని ప్రారంభించింది. ఈ కొత్త సౌకర్యం ద్వారా పాలసీదారులు తమకు ఇష్టమైన బ్యాంకు మొబైల్ యాప్ ద్వారా నేరుగా ప్రీమియం చెల్లించగలరు. దీనికోసం వేరు వేరు ఇంటర్నెట్ బ్యాంకింగ్ లాగిన్ వివరాలు అవసరం లేకుండా, కేవలం ఒకే దశలో ప్రామాణీకరణతో చెల్లింపు పూర్తి చేయవచ్చు. ఈ సదుపాయం ఎన్‌పీసీఐ పరిచయమైన 'బ్యాంకింగ్ కనెక్ట్' ప్లాట్‌ఫారమ్ ద్వారా అందుబాటులోకి వచ్చింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఈ ఫీచర్‌ను వినియోగదారులకు అందించిన తొలి జీవిత బీమా సంస్థగా నిలిచింది. ఇది గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో అధికారికంగా ప్రారంభించబడింది.ఈ కొత్త బ్యాంకింగ్ కనెక్ట్ సేవ మొబైల్ ఫస్ట్ పద్ధతిలో రూపుదిద్దుకుంది. ఇది బహుళ బ్యాంకులు మరియు చెల్లింపు సమన్వయకర్తలను ఒకే డిజిటల్ వేదికపైకి తెస్తూ, వినియోగదారులకు తాము ఇష్టపడే బ్యాంకు యాప్ ద్వారా సౌకర్యవంతమైన చెల్లింపు అవకాశం ఇస్తుంది. సంస్థ కార్యకలాపాల అధికారి శ్రీ అమిష్ బ్యాంకర్ తెలిపినట్లు, ఈ సదుపాయం వినియోగదారుల అనుభవాన్ని సులభతరం చేయడం, డిజిటల్ సేవలను మరింత చేరువ చేయడం అనే లక్ష్యాలతో రూపొందించబడింది. ఈ ప్రయత్నం కంపెనీ యొక్క డిజిటల్ ఆవిష్కరణ దిశలో మరో ముందడుగుగా నిలుస్తుంది. భవిష్యత్తులో ఈ ఫీచర్‌లో అదనపు సేవలను చేర్చి, వినియోగదారులు తమ పాలసీ వివరాలను రియల్ టైమ్‌లో సులభంగా నిర్వహించుకునేలా చేసే ప్రణాళిక ఉందని సంస్థ ప్రకటించింది.

### ఐకేపీ నాలెడ్జ్ పార్క్ ఐకేఎంసీ 2025లో 150 స్టార్టప్‌ల ప్రతిభ ప్రదర్శన



హైదరాబాద్ లో ఐకేపీ నాలెడ్జ్ పార్క్ తన వార్షిక ఆవిష్కరణ మహాసభ ం ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిల్లీనియం కాన్ఫరెన్స్ 2025ని "బియాండ్ ద బ్లూప్రింట్: రీక్యాలిబ్రేటింగ్ ఇన్నోవేషన్ ఫర్ ఎ డిస్రప్టెడ్ వరల్డ్" అనే అంశంతో ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో 150 మంది ఆవిష్కర్తలు మరియు స్టార్టప్ సంస్థలు తమ సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రాజెక్టుల విభాగానికి చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేష్ రంజన్ మరియు ప్రొఫెసర్ విజయ్ చంద్రు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయేష్ రంజన్ మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగినదని, ఐకేపీ ఈ రంగంలో 25 సంవత్సరాలుగా అగ్రగామిగా ఉ ందని అన్నారు. టెక్ఎక్స్ ఇన్నోవేషన్ షోకేస్ ద్వారా స్టార్టప్‌లకు నిధులు, గుర్తింపు, భాగస్వామ్య అవకాశాలు లభించడం ద్వారా గ్లోబల్ స్థాయిలో ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో ఐకేపీ సంస్థ కొత్త పెట్టుబడులను ప్రకటించింది. 'ఐకేపీ ఫ్యూచర్ ఫార్వర్డ్ ఫండ్' ద్వారా ప్రోజెన్ ఫుడ్స్ స్టార్టప్‌లో రూ. 1 కోటి వరకు పెట్టుబడి పెట్టనుంది. అదేవిధంగా, ఐకేపీ ఫ్యూచర్ స్టార్స్ అవార్డ్స్ కింద 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన ఐదుగురు యువ ఆవిష్కర్తలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల గ్రాంట్‌ను ప్రకటించింది. వీరిలో సబ్‌టిల్ప్టోటిక్ ప్రైవేట్ లిమిటెడ్, వసుదేవ ఇన్నోవేషన్స్, ఆల్జివిటీ, ఎవోక్సియా ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు జీవిఏ హెల్త్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి. ఈ స్టార్టప్‌లను ఆవిష్కరణ మరియు పెట్టుబడి నిపుణుల సమీక్ష ద్వారా ఎంపిక చేశారు. ఈ సమావేశం టెక్నాలజీ స్వావలంబన, వ్యూహాత్మక స్వతంత్రత మరియు ప్రపంచ సహకారం వంటి అంశాలపై ఆలోచనాత్మక చర్చలకు వేదికగా నిలిచింది.

### భారత-సీషెల్స్ భాగస్వామ్యం పునరుద్ధరించిన రాధాకృష్ణన్



సీషెల్స్ ప్రభుత్వ ఆహ్వానంపై భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అక్టోబర్ 26న రెండు రోజుల అధికారిక పర్యటనను ప్రారంభించారు. తొలి రోజు ఆయన సీషెల్స్‌లోని భారత వంశజులతో సమావేశమై రెండు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ, విశ్వసనీయ మరియు బహుముఖ సంబంధాలను ప్రస్తావించారు. భారత ప్రవాసుల కృషి ద్వారానే ఈ బంధం మరింత బలపడిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయన డాక్టర్ ప్యాట్రిక్ హెర్మిని సీషెల్స్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ తెలిపిన ప్రకారం, ఉపరాష్ట్రపతి "విజన్ మహాసాగర్" మరియు "పక్కదేశాల ప్రాధాన్యత" విధానాల పట్ల భారత కట్టుబాటును మరోసారి ధృవీకరించారు.అక్టోబర్ 27న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ రాష్ట్రపతి డాక్టర్ ప్యాట్రిక్ హెర్మినిని రాష్ట్ర భవనంలో కలిశారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, భారత మహాసముద్ర ప్రాంతం మరియు గ్లోబల్ సౌత్‌లో శాంతి, స్థిరత్వం, అభివృద్ధి కోసం కలసి పనిచేయాలని చర్చించారు. అనంతరం సీషెల్స్ ఉపరాష్ట్రపతి ఎన్నికైన సెబాస్టియన్ పిలేను కూడా రాధాకృష్ణన్ కలసి రెండు దేశాల మధ్య ఉన్న సాంస్కృతిక, వారసత్వ, ప్రజా సంబంధాలను మరింతగా విస్తరించే మార్గాలను పరిశీలించారు.

### మేక్‌మైట్రిప్ 'ట్రావెల్ కా ముహూర్త్'తో కొత్త ప్రయాణ సీజన్ ఆరంభం

భారతదేశ ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ సంస్థ మేక్‌మైట్రిప్, సంవత్సరాంత ప్రయాణ ప్రణాళికల కోసం ప్రత్యేకమైన కొత్త క్యాలెండర్ క్షణం 'ట్రావెల్ కా ముహూర్త్'ను ప్రకటించింది. ఈ కార్యక్రమం అక్టోబర్ 29 నుండి నవంబర్ 30, 2025 వరకు కొనసాగుతుంది. ఇందులో విమానాలు, హోటళ్లు, సెలవు ప్యాకేజీలు, గ్రౌండ్ ట్రాన్స్‌పోర్ట్, టూర్లు, వీసా, ఫారెక్స్, ట్రావెల్ ఇన్సూరెన్స్ వంటి విభాగాలు సమగ్రంగా ఉన్నాయి. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎతిహాద్, ఎయిర్ ఏషియా వంటి ప్రధాన ఎయిర్‌లైన్లు, అలాగే ది లీలా, ఓబెరాయ్ గ్రూప్, రాడిసన్, లెమన్ ట్రీ, విందమ్, అట్లాంటిస్ వంటి అంతర్జాతీయ హోటల్ చైన్లు భాగస్వాములుగా ఉన్నాయి. బ్యాంకింగ్ భాగస్వాములుగా యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్సీ బ్యాంక్, హెచ్ఎస్‌బీసీ బ్యాంక్, వీసా మరియు రూపే నెట్‌వర్క్‌లతో కలసి వినియోగదారులకు ప్రత్యేక తగ్గింపులు అందించబడతాయి.ఈ ప్రచారంలో ప్రతి వారం దేశీయంగా అండమాన్, గోవా, కేరళ, రాజస్థాన్ వంటి పర్యాటక కేంద్రాలు మరియు అంతర్జాతీయంగా దుబాయ్, థాయ్‌లాండ్, వియత్నాం, యూరప్ వంటి గమ్యస్థానాలు ప్రధానంగా ఉంటాయి. మేక్‌మైట్రిప్ సహ వ్యవస్థాపకుడు రాజేష్ మాగో ప్రకారం, 'ట్రావెల్ కా ముహూర్త్' పర్యాటక రంగంలో కొత్త మైలురాయిగా నిలుస్తుంది. భారతీయులు సాధారణంగా నవంబర్ నాటికే తమ పర్యటనలను ఖరారు చేసే ధోరణిని దృష్టిలో ఉంచుకొని, ఈ సమయాన్ని ప్రత్యేకంగా గుర్తించేందుకు ఈ ప్రణాళిక రూపొందించబడిందని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ప్రయాణ ప్రణాళికను మరింత ఆసక్తికరంగా, స్ఫూర్తిదాయకంగా మార్చడం మేక్‌మైట్రిప్ లక్ష్యమని తెలిపారు.బుకింగ్ ట్రెండ్‌ల ఆధారంగా, డిసెంబర్‌లో నాణ్యమైన ఎంపికలు అమ్ముడుపోతాయని మరియు ఛార్జీలు పెరుగుతాయని అంచనా వేసిన చాలా మంది ప్రయాణికులు, నవంబర్ నాటికి దాదాపు 30% మంది తమ బుకింగ్‌లను పూర్తి చేయడంతో, వారి ప్రయాణాలను ముందుగానే ఖరారు చేస్తారు.

## లాభాల్లో ముగిసిన సూచీలు..

### సెన్సెక్స్ 567 పాయింట్లు, నిఫ్టీ 170.90 పాయింట్ల లాభం

### 4044 డాలర్ల వద్ద కొనసాగిన ఔన్సు బంగారం



మార్కెట్ లో సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. వరుసగా ఆరు రోజుల పాటు వరుస లాభాలు చవిచూసిన సూచీలు.. శుక్రవారం విరామం తీసుకున్నాయి. మళ్లీ ఈ వారాన్ని లాభాలతో మొదలుపెట్టాయి. ముఖ్యంగా అమెరికాలో ఊహించిన దానికంటే తక్కువ ద్రవ్యోల్బణం నమోదు కావడం మన సూచీలకు కలిసొచ్చింది. దీనివల్ల 2025లో ఫెడ్ రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలపడ్డాయి. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే భారత్ వంటి మార్కెట్లలోకి నిధుల ప్రవాహం పెరుగుతుంది. దీనికితోడు అమెరికా-చైనా మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలతో సూచీలు దూసుకెళ్లాయి. సెన్సెక్స్ ఉదయం 84,297.39 పాయింట్ల లాభంతో (క్రితం ముగింపు 84,211.88) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,932.08 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 566.96 పాయింట్ల లాభంతో 84,778.84 వద్ద ముగిసింది. నిఫ్టీ 170.90 పాయింట్ల లాభంతో 25,966.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.25గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్, ఎటెర్నల్, ఎస్‌బీఐ, టాటా మోటార్స్ ప్యాసింజర్స్ వెహికల్స్ రాణించాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, బీఈఎల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.49 వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4044 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## గడువుకు ముందే అమెజాన్ $20 బిలియన్ల మైలురాయి




న్యూఢిల్లీ : 2015 మరియు 2025 మధ్య కాలంలో అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రోగ్రామ్ ద్వారా భారతదేశం నుండి సంచిత ఈ-కామర్స్ ఎగుమతుల పరంగా లక్షలాది మంది భారతీయ విక్రేతలు $ 20 బిలియన్లను అధిగమించడానికి వీలు కల్పించినట్లు అమెజాన్ నేడు వెల్లడించింది. 2025 నాటికి భారతదేశం నుండి $10 బిలియన్ల సంచిత ఈకామర్స్ ఎగుమతులను చేస్తామని 2020లో అమెజాన్ ప్రతిజ్ఞ చేసింది. తరువాత కాలంలో దీనిని $20 బిలియన్లకు సవరించారు. ఇప్పుడు, అమెజాన్ తన ఎగుమతుల ప్రతిజ్ఞను గడువుకు ముందే చేరుకుంది.

అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ దేశవ్యాప్తంగా అద్భుతమైన స్వీకరణను చూస్తోంది. భారతదేశం అంతటా 28 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు మరియు 200ం నగరాల నుండి విక్రేతలను నమోదు చేసుకుంది. గత 10 సంవత్సరాల కాలంలో, ఈ కార్యక్రమం భారతీయ వ్యవస్థాపకులకు ప్రపంచ అవకాశాలను సాంకేతికత ఎలా తెరువ గలదో విజయవంతంగా ప్రదర్శించింది. ఇది ఎగుమతిదారులు యుఎస్,యుకె,యుఏఈ, సౌదీఅరేబియా, కెనడా, మెక్సికో, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్ మొదలైన దేశాలలోని 18 కంటే ఎక్కువ అమెజాన్ గ్లోబల్ మార్కెట్‌ప్లేస్‌లలో కోట్లాది మంది కస్టమర్లకు విక్రయించడం ద్వారా గ్లోబల్ బ్రాండ్‌లను నిర్మించడానికి వీలు కల్పిస్తుంది.

అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ఇండియా హెడ్ శ్రీనిధి కల్వపూడి మాట్లాడుతూ "అమెజాన్ వద్ద , భారతదేశం యొక్క సాంప్రదాయ ఎగుమతి బలాలు, ఆరోగ్యం మరియు వ్యక్తిగత సంరక్షణ, అందం, బొమ్మలు, గృహోపకరణాలు మరియు ఫర్నిచర్ వంటి వాటిలో గణనీయమైన వృద్ధిని మేము చూశాము. 2015 నుండి, అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రోగ్రామ్ ద్వారా భారతదేశం నుండి %$%20 బిలియన్ల సంచిత ఇ-కామర్స్ ఎగుమతులను అమెజాన్ సాధ్యం చేసింది, తద్వారా 2025 లక్ష్యానికి ముందే ఈ మైలురాయిని చేరుకుందన్నారు.

హోమ్‌మాండే వ్యవస్థాపకులు , అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ విక్రేత సర్వేష్ అగర్వాల్ మాట్లాడుతూ "హోమ్‌మాండే వద్ద , స్థిరమైన, అధిక-నాణ్యత గల జనపనార రగ్గుల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఇళ్లకు భారతదేశ కళాత్మక నైపుణ్యాన్ని తీసుకురావడమే మా లక్ష్యం.

అమెజాన్ యొక్క అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ విభాగాలలో రగ్గులు ఉ న్నాయని మేము చూసినప్పుడు, అంతర్జాతీయంగా వ్యాప్తి చెందడానికి ఇది సరైన అవకాశం అని మాకు తెలుసు. అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్‌తో, మేము మార్కెట్ ట్రెండ్‌లను అధ్యయనం చేయగలిగాము, పర్యావరణ స్పృహ ఉన్న కొనుగోలుదారులను చేరుకోగలిగాము.

## జెట్టై రుణదాతల పునర్నిర్మాణా నికి సింగపూర్ కోర్టు

జెట్టై ప్రైవేట్ లిమిటెడ్ వాజిర్ఎక్స్ పునరుద్ధరణ ప్రయాణంలో ఒక ముఖ్యమైన అభివృద్ధిగా, సింగపూర్ గౌరవనీయ హైకోర్టు, జెట్టై ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిపాదించిన రుణదాత-ఆమోదిత పునర్నిర్మాణ పథకాన్ని సవరణలతో అధికారికంగా ఆమోదించిందని ప్రకటించింది. ఇందుకు కారణం, 2025 ఆగస్టు నెలలో, 95.7% ఓటు వేసిన రుణదాతలు ం విలువలో 94.6% ప్రాతినిధ్యం వహిస్తూ ం స్కీమ్ కు మళ్లీ అనుకూలంగా ఓటు వేయడమే.

"ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రిప్టో పరిశ్రమలో అత్యంత వేగంగా జరిగిన పునర్వ్యవస్థీకరణల్లో ఒకటిగా గుర్తించబడుతుంది. ఈ రంగపు చరిత్రలోనే అత్యంత పెద్ద సైబర్ దాడుల్లో ఒకదానిని ఎదుర్కొన్నప్పటికీ, వర్జీర్ ఎక్స్ ప్రస్థానంలో ఇదొక కీలక మైలురాయి. మేము మా రుణదాతల ప్రయోజనాల కోసం కృషి చేస్తూ, మా లక్ష్యంపై పూర్తిగా దృష్టి సారిస్తున్నాము. ఈ పథకం నేటి తీర్పు ఆధారంగా చట్టబద్ధంగా అమల్లోకి వచ్చిన వెంటనే, మేము 10 పని దినాలలోపు ప్లాట్‌ఫారమ్ కార్యకలాపాలు ప్రారంభిస్తాము.

ఓపికతో, ఎంతో నమ్మకంతో మాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని వర్జీర్ ఎక్స్ వ్యవస్థాపకుడు నిశ్చల్ శెట్టి అన్నారు.

## అపోలో ఆయుర్వేద న్యూరో శిబిరం




ఆయుర్వేద హెచ్‌సిఎహెచ్ సెంటర్ ఫర్ ఆయుర్వేద అండ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్, సోమాజిగూడ, హైదరాబాద్ లో గురువారం, 30 అక్టోబర్, ఉ దయం 10 - సాయంత్రం 4 వరకు అపోలో ఆయుర్వేద న్యూరో శిబిరం సాగనుంది, నేటి ఒత్తిడితో కూడిన మరియు నిశ్చల జీవనశైలిలో, నాడీ సంబంధిత రుగ్మతలు మైగ్రేన్లు మరియు న్యూరోపతి నుండి పార్కిన్సన్స్, స్ట్రోక్ మరియు మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి సంక్లిష్ట పరిస్థితుల వరకు అన్ని వయసుల వారిని ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ రుగ్మతలు కదలిక, సమన్వయం మరియు నరాల పనితీరును ప్రభావితం చేస్తాయి, తరచుగా జీవన నాణ్యతను తగ్గిస్తాయి. మా నిపుణులైన వైద్యులను కలవడానికి, వివరణాత్మక మూల్యాంకనం పొందడానికి మరియు సమగ్ర సంరక్షణ వైపు మీ ప్రయాణాన్ని ప్రారంభించడానికి అపోలో ఆయుర్వేద న్యూరో ఆరోగ్య శిబిరాన్ని వినియోగించుకోవచ్చు.

## లయోర్డ్ గ్రూప్ న్యూ వెంచర్ లాంచింగ్



లయోర్డ్ గ్రూప్ సంస్థ నుంచి ఇప్పటి వరకు లయోర్డ్ హెల్త్ కేర్ సంస్థలు మనకు తెలిసినదే. ఈ సంస్థ మరో కొత్త వెంచర్ తో మన ముందుకు వస్తుంది. లయోర్డ్ గ్రూప్ యజమానులు విద్యసంస్థల్లో నూతన అధ్యాయంతో న్యూ టెక్నాలజీతో హై స్టాండర్డ్స్ ఎడ్యుకేషన్‌ని నేటి తరం విద్యార్థులకు అందించడానికి ఒక కొత్త ఒరవడితో మన ముందుకు వస్తున్నారు. ద

దాని పేరే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్. మరి అతిరథమహారథుల సమక్షంలో ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జె.డి. లక్ష్మీనారాయణ జ్యోతి, జయప్రకాష్‌నారాయణ, బాలలత తదితరుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలనతో మొదలయింది.

ఈ సందర్భంగా లయోర్డ్ గ్రూప్ సంస్థ సీఎండి విక్రం నారాయణరావు మాట్లాడుతూ... ఇక్కడికి విచ్చేసిన పెద్దలందరికీ నా కృతజ్ఞతలు. ఇప్పటికే మా సంస్థల ద్వారా మూడు వందలకు పైగా ఉ ద్యోగాలు కల్పిస్తున్నాము. మా ఈ ప్రయాణంలో ఎంతోమందికి స్ఫూర్తిగా నలబడాలన్నదే మా ఆశయం. ఈ ప్రయాణంలో నేర్చుకున్న విషయాలు ఎన్నో ఉన్నాయి. ఎన్నో విషయాల్లో ముందంజలో ఉన్న దేశాలతో పాటు మన భారతదేశం కూడా అదే పంథాలో ముందుకు వెళ్ళాలన్నదే మా ప్రధాన లక్ష్యం. అందుకే ఈ ధనిక్ భారత్ విద్యా సంస్థను నిర్మించడం జరిగింది. దీని ద్వారా నేటి తరం విద్యార్థులకు మంచి క్వాలిటీ విద్యను అందించాలన్నదే మా ప్రధాన ధ్యేయం. విద్యారంగంలో ఇప్పటికే ఉన్న ఎన్నో ఇబ్బందులను పోరాడి. విద్యార్థులను మంచిగా తీర్చిదిద్దడమే అభివృద్ధి చెందిన భారతావనిగా మార్చాలన్నదే మా లక్ష్యం. దేశ విదేశాల్లో ఉన్న మంచి ప్రొఫెసర్లతో మంచి విద్యను అందించగలగాలని కోరుకుంటున్నాము. ధనికభారత్ మాకు మరో వ్యాపార సంస్థ కాదని ఈ సందర్భంగా మేము తెలియజేస్తున్నాము. సమాజానికి దేశానికి ఉపయోగపడే సామాజికంగా ఈ ఇన్‌స్టిట్యూట్ మొదలు పెట్టడం జరిగిందని తెలియజేశారు.

### భయాన్ని జయించి అవగాహనకు పునాదిగా నిలిచిన 'బియాండ్ ది పింక్ రిబ్బన్' కార్యక్రమం



సత్వ నోలెడ్జ్ సిటీలోని ది క్వోరంలో వెల్‌నెస్ బజార్ నిర్వహించిన 'బస్టింగ్ మిథ్స్, సేవింగ్ లైవ్స్'కార్యక్రమం స్తన క్యాన్సర్‌పై ఉన్న అపోహలను చెదరగొడుతూ, భయాన్ని ఆశగా మార్చిన ఆవిష్కరణాత్మక చర్చా వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమం స్తన క్యాన్సర్ అవగాహన నెలను పురస్కరించుకొని, సమాజంలో స్త్రీల ఆరోగ్యంపై సానుకూల సంభాషణలకు దారితీసింది. వెల్‌నెస్ బజార్ వ్యవస్థాపకులు పూజా ఖాన్, రఘు వంశీ రెడ్డి, మరియు కాశిఫ్ అలీ ఖాన్ ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. మహావీర్ మోటార్స్, సత్వ మరియు ఐడీఎఫ్‌సీ బ్యాంక్ భాగస్వామ్యంతో నిర్వహించబడిన ఈ వేడుకకు కాంటెల్ మెడికల్ డయాగ్నస్టిక్స్ మద్దతు అందించింది.పద్మశ్రీ డా. పి. రఘురామ్ (స్థాపకుడు, కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీసెస్) భారతదేశంలో స్తన క్యాన్సర్‌పై ఉన్న అపోహలను స్పష్టంచేశారు. ఆయన తెలిపారు: "భారతదేశంలో స్తన క్యాన్సర్ కేసులు ఎక్కువగా 40%-%60 ఏళ్ల వయస్సు గల మహిళల్లోనే కనిపిస్తున్నాయి, అలాగే అవగాహన లేకపోవడం వలన 60% కేసులు ఆలస్య దశల్లో గుర్తించబడుతున్నాయి." ఆయన స్పష్టంచేసినట్లుగా, 10 స్తన గడ్డలలో 9 క్యాన్సర్ కావు మరియు కేవలం 5%-%10% కేసులు వారసత్వ సంబంధం కలిగినవే.డా. ప్రతిభా నారాయణ జీవనశైలి, హార్మోన్ల సమతుల్యత, మరియు మానసిక ఒత్తిడి నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. "స్తన ఆరోగ్యంపై చర్చలు భయంతో కాదు, సానుభూతితో ప్రారంభమవ్వాలి" అని ఆమె పేర్కొన్నారు. స్త్రీలు రక్తపోటు లేదా బరువు చెక్ చేసుకున్నట్టే స్తన పరీక్షలను కూడా సాధారణ వైద్య పరీక్షలలో భాగంగా తీసుకోవాలని ఫిట్‌నెస్ ఐకాన్ దినాజ్ వర్వత్వాలా స్ఫూర్తిదాయకంగా చర్చను మోడరేట్ చేస్తూ వైద్యపరమైన సమాచారం మరియు వ్యక్తిగత అనుభవాలను కలిపి సమతుల్య వేదిక సృష్టించారు. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుకా చౌదరి పాల్గొని, "40 ఏళ్లు దాటిన ప్రతి మహిళ సంవత్సరానికి ఒకసారి మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలి.

రేడియేషన్ లేదా నొప్పిపై ఉన్న భయాలు తప్పుడు అభిప్రాయాలే" అని స్పష్టం చేశారు.చివరగా జరిగిన ప్రశ్నోత్తర సెషన్‌లో పాల్గొన్నవారు తమ అనుభవాలను పంచుకుంటూ భయాన్ని స్పష్టతగా, అపహాస్యాన్ని అవగాహనగా మార్చారు.

ఈ సాయంత్రం 'పింక్ రిబ్బన్'కు మించిన అవగాహన, నమ్మకం, మరియు మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచింది.ఈ కార్యక్రమం కేవలం అవగాహన పరిమితి కాకుండా, వ్యక్తిగత చర్యలకు ప్రేరణనిచ్చే వేదికగా నిలిచింది. ప్రసంగాలు, వ్యక్తిగత కథలు మరియు వైద్య సూచనల ద్వారా, ప్రతి మహిళ తన ఆరోగ్యాన్ని సజాగ్రతతో కాపాడుకునే సామర్థ్యాన్ని పొందింది. పాల్గొనినవారు తాము తెలుసుకున్న తాజా పరిజ్ఞానాన్ని కుటుంబ సభ్యులు మరియు స్నేహితులతో పంచుకుని, సమాజంలో స్తన క్యాన్సర్‌పై ఉన్న పక్షపాతం, అపోహలను తగ్గించగలదని భావిస్తున్నారు. ఈ విధంగా, ఒక్కో వ్యక్తి ఒక పెద్ద మార్పును సృష్టించగల సామర్థ్యం ఉన్నదని ఈ కార్యక్రమం స్పష్టంగా చూపిస్తుంది.అదనంగా, కార్యక్రమం స్థానిక మరియు విస్తృత కమ్యూనిటీ లెవల్స్‌లో కొనసాగుతున్న ప్రాధాన్యతా ప్రాజెక్టులకు దారి చూపింది.

### అక్షిస్ మ్యూచువల్ ఫండ్ కొత్త 'ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రాజ్ పాసివ్ ప్రారంభం

భారతదేశంలోని ప్రముఖ ఆస్తి నిర్వహణ సంస్థ అక్షిస్ మ్యూచువల్ ఫండ్, తన తాజా ఓపెన్-ఎండెడ్ స్కీమ్ 'అక్షిస్ ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రాజ్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ ను ప్రకటించింది. ఈ పథకం పెట్టుబడిదారులకు స్థిరత్వం, ముందస్తు అంచనా మరియు పన్ను సామర్థ్యాన్ని సమతుల్యంగా అందించే విధంగా రూపొందించబడింది. కొత్త ఫండ్ ఆఫర్ అక్టోబర్ 28 నుండి నవంబర్ 11, 2025 వరకు అందుబాటులో ఉంటుంది. దీన్ని దేవాంగ్ షా, ఆదిత్య పగారియా, హార్దిక్ సత్రా మరియు కార్తిక్ కుమార్ సంయుక్తంగా నిర్వహిస్తారు.ఈ ఫండ్‌లో 50-65% పెట్టుబడి పాసివ్ డెబ్-ఓరియెంటెడ్ మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లలో, 35%-50% ఆర్బిట్రాజ్ ఫండ్‌లలో, 0%-5% మనీ మార్కెట్ సాధనాల్లో ఉంటుంది. ఈ మిశ్రమ పెట్టుబడి వ్యూహం ద్వారా మధ్యకాలంలో స్థిరమైన రాబడులు అందించే లక్ష్యంతో ఇది రూపొందించబడింది. ఎగ్జిట్ లోడ్ లేకుండా,2 రిడంప్షన్ లిక్విడిటీతో ఈ పథకం పెట్టుబడిదారులకు సౌలభ్యాన్ని అందిస్తుంది. అక్షిస్ ఏఎంసీ సీఈఓ బి. గోపుకుమార్ ప్రకారం, ఈ ఫండ్ "సులభమైన, పారదర్శకమైన మరియు పన్ను పరంగా సమర్థవంతమైన స్థిర ఆదాయ పెట్టుబడి మార్గం"గా నిలుస్తుంది.ఈ పథకం 65% నిఫ్టీ షార్ట్ డ్యూరేషన్ డెబ్ ఇండెక్స్ మరియు 35% నిఫ్టీ 50 ఆర్బిట్రాజ్ టిఆర్ఐ కలయికతో బెంచ్‌మార్క్ చేయబడింది. దీని ప్రధాన లక్ష్యం తక్కువ ప్రమాదంతో స్థిరమైన, పన్ను సామర్థ్య రాబడులు అందించడం. సాధారణ డెబ్ ఫండ్‌లు లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లతో పోలిస్తే, ఈ ఫండ్ 24 నెలల కంటే ఎక్కువ కాలం ఉంచినప్పుడు కేవలం 12.5% దీర్ఘకాలిక మూలధన లాభ పన్ను వర్తిస్తుంది. అందువల్ల కార్పొరేట్‌లు, అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు , మరియు రిటైల్ పెట్టుబడిదారుల కోసం ఇది సమయోచితమైన, రక్షణాత్మక పెట్టుబడి ఎంపికగా భావించబడుతోంది.

### పిఎల్ క్యాపిటల్ గ్రూప్ సిఇఓగా జరీన్ దారువాలా నియామకం



భారతదేశంలో విశ్వసనీయ ఆర్థిక సేవా సంస్థలలో ఒకటైన పిఎల్ క్యాపిటల్ (ప్రభుదాస్ లిల్లాధర్ గ్రూప్), జరీన్ దారువాలాను గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఓ)గా నియమించినట్లు ప్రకటించింది. ఈ నియామకం అక్టోబర్ 13, 2025 నుంచి అమల్లోకి వచ్చింది. జరీన్ దారువాలాకు బ్యాంకింగ్ మరియు ఆర్థిక రంగాలలో 35 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. ఆమె అంతకుముందు స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌లో భారతదేశం మరియు దక్షిణాసియా విభాగాలకు సిఇఓగా పనిచేశారు. ఆమె నాయకత్వంలో ఆ బ్యాంక్ రిటైల్ బ్యాంకింగ్ రంగాన్ని సంపద నిర్వహణ కేంద్రితంగా మలచి, కార్పొరేట్ బ్యాంకింగ్ విభాగాన్ని అభివృద్ధి మరియు ఆవిష్కరణ భాగస్వామిగా తీర్చిదిద్దింది.పిఎల్ క్యాపిటల్‌లో ఆమె పాత్ర సంస్థ యొక్క దీర్ఘకాల వృద్ధి దృష్టిని నడిపించడం, బ్రోకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, కార్పొరేట్ సలహా, ప్రైవేట్ క్రెడిట్, వెల్త్ మేనేజ్‌మెంట్ మరియు ఆస్తి నిర్వహణ రంగాలలో సామర్థ్యాలను విస్తరించడం పై కేంద్రీకృతమై ఉంటుంది. పిఎల్ క్యాపిటల్ చైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ అమిషా వోరా మాట్లాడుతూ, "జరీన్ నియామకం మా సంస్థకు ఒక కీలక మలుపు. వారసత్వం, విశ్వాసం మరియు ఆధునికతను కలిపిన సంస్థగా ఎదగడంలో ఆమె నాయకత్వం కీలకం అవుతుంది" అని తెలిపారుజరీన్ దారువాలా మాట్లాడుతూ, "పిఎల్ క్యాపిటల్‌లో చేరడం ఒక గౌరవం. సంస్థకు బలమైన పునాది, లోతైన మార్కెట్ అవగాహన మరియు కస్టమర్-ఫస్ట్ దృక్పథం ఉన్నాయి. భవిష్యత్‌కు సిద్ధమైన ఆర్థిక సేవల వేదికగా పిఎల్ క్యాపిటల్‌ను తీర్చిదిద్దడం ఉత్సాహభరితమైన సవాల్" అని పేర్కొన్నారు. ఈ నియామకం పిఎల్ క్యాపిటల్ యొక్క కొత్త వృద్ధి దశకు నాంది పలుకుతూ, టెక్నాలజీ, ప్రతిభ మరియు విశ్వసనీయ భాగస్వామ్యాలపై సంస్థ దృష్టిని మరింత బలపరచనుంది.

### క్రాంప్టన్ రూ. 445 కోట్ల సౌర రూఫ్‌టాప్ ఆర్డర్ సాధన

#### 40,000 ఇళ్లకు గ్రీన్ ఎనర్జీ పరిష్కారం

భారత గృహ మరియు ఇంధన పరిష్కారాల్లో ప్రముఖ సంస్థ క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లో 40,000కు పైగా గృహాలను సౌర శక్తితో అనుసంధానించే భారీ ఆర్డర్‌ను సాధించింది. మొత్తం రూ. 445 కోట్ల విలువ గల ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి గృహానికి 2 కిలోవాట్ ఆన్-గ్రిడ్ రూఫ్‌టాప్ సిస్టమ్ ఏర్పాటు చేయబడనుంది. 77 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన ఈ ప్రాజెక్ట్ క్రాంప్టన్‌కి ఇప్పటివరకు లభించిన అతిపెద్ద సౌర రూఫ్‌టాప్ ఆర్డర్‌గా నిలిచింది. సౌర మార్కెట్లో ప్రవేశించిన రెండు నెలల్లోనే ఈ మైలురాయిని సాధించడం సంస్థ వేగవంతమైన వృద్ధికి నిదర్శనం.ఈ ప్రాజెక్ట్ ద్వారా క్రాంప్టన్ దేశంలోని పునరుత్పత్తి ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా పర్యావరణహిత పరిష్కారాలను విస్తరిస్తోంది. నివాస గృహాల్లో సౌర శక్తి వినియోగం వేగంగా పెరుగుతోంది, సుమారు రూ. 20,000-25,000 కోట్ల మార్కెట్ పరిమాణం కలిగిన ఈ రంగం ప్రతి సంవత్సరం 20% కంటే ఎక్కువ వృద్ధిని సాధించనుంది. సంస్థ శిక్షణ పొందిన సిబ్బంది, విస్తృత సేవా వలయంతో ప్రతి గృహానికి సమర్థవంతమైన, నిర్వహణ సులభమైన సౌర పరిష్కారాలను అందించనుంది. క్రాంప్టన్ ఎండీ మరియు సిఇఓ ప్రోమీట్ ఘోష్ మాట్లాడుతూ, "రూ. 445 కోట్ల ఈ ఆర్డర్ మా పునరుత్పత్తి శక్తి ప్రయాణంలో కీలకమైన మైలురాయి. సుస్థిర, సాంకేతికంగా నూతన పరిష్కారాల ద్వారా భారత గ్రీన్ ఎనర్జీ దిశలో మా కట్టుబాటును మరింత బలపరుస్తుంది" అన్నారు.లైటింగ్ బిజినెస్ యూనిట్ హెడ్ షలీన్ నాయక్ మాట్లాడుతూ, "40,000 కంటే ఎక్కువ ఇళ్లను కవర్ చేసే ఈ ప్రాజెక్ట్ మా సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. నాణ్యత, స్థిరత్వం, సమయపాలనతో ప్రాజెక్ట్‌ను విజయవంతం చేస్తాం" అని పేర్కొన్నారు. 85 సంవత్సరాల అనుభవంతో క్రాంప్టన్, శక్తి ఆదా మరియు పునరుత్పత్తి ఇంధన పరిష్కారాల్లో దేశంలో నమ్మకమైన నాయకుడిగా తన స్థానం మరింత బలపరుచుకుంటోంది.

### లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపిఒ అక్టోబర్ 31న ప్రారంభం



ప్రముఖ ఐవేర్ కంపెనీ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ లిమిటెడ్ తన ప్రాథమిక షేర్ ఇష్యూ ను అక్టోబర్ 31, 2025 (శుక్రవారం)న ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ ఆఫర్ నవంబర్ 4, 2025 (మంగళవారం) వరకు కొనసాగుతుంది. యాంకర్ ఇన్వెస్టర్ బిడ్డింగ్ అక్టోబర్ 30, 2025 (గురువారం)న జరగనుంది. షేర్ ధర పరిధి ₹382 నుండి ₹402గా నిర్ణయించబడింది. ఒక్కో షేర్ ముఖ విలువ ₹2 కాగా, కనీసం 37 షేర్లు మరియు దాని గుణితాలుగా దరఖాస్తులు చేసుకోవచ్చు. అర్హులైన ఉద్యోగులకు ఒక్కో షేర్‌పై ₹19 తగ్గింపు లభిస్తుంది.ఈ ఐపిఒలో రూ. 2,150 కోట్ల విలువైన తాజా షేర్ జారీతో పాటు, పేయుష్ బన్సల్, నేహా బన్సల్, అమిత్ చౌధరి, సుమీత్ కపాహి వంటి ప్రమోటర్లు మరియు విదేశీ పెట్టుబడిదారులు కలిపి 12.75 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ చేయనున్నారు. ఈ జారీ యొక్క బుక్ బిల్డింగ్ ప్రక్రియ ద్వారా జరగనుంది. మొత్తం నికర ఆఫర్‌లో కనీసం 75% భాగం సంస్థాగత పెట్టుబడిదారులకు15% పెద్ద పెట్టుబడిదారులకు , మరియు 10% రిటైల్ పెట్టుబడిదారులకు కేటాయించబడుతుంది. ఉ ద్యోగుల కోసం రూ. 150 మిలియన్ల విలువైన ప్రత్యేక రిజర్వేషన్ భాగం ఉంది.ఈ ఐపిఒ బీఎస్‌ఈ మరియు ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ అవుతుంది. ఇష్యూ మేనేజ్‌మెంట్ బాధ్యతలను కోటక్ మహీంద్రా క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీ ఇండియా, అవెండస్ క్యాపిటల్, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, అక్షిస్ క్యాపిటల్, మరియు ఇంటెన్సివ్ ఫిస్కల్ సర్వీసెస్ నిర్వహిస్తున్నాయి. లెన్స్‌కార్ట్ ఈ ఐపిఒ ద్వారా తన వ్యాపార విస్తరణ, టెక్నాలజీ పెట్టుబడులు మరియు అంతర్జాతీయ విస్తరణ ప్రణాళికలకు నిధులు సమీకరించనుంది.ఇంకా, ఈక్విటీ షేర్లు ఉద్యోగుల రిజర్వేషన్ పోర్షన్ కింద దరఖాస్తు చేసుకునే అర్హత కలిగిన ఉద్యోగులకు దామాషా ప్రాతిపదికన కేటాయించబడతాయి, ఆఫర్ ధరకు లేదా అంతకంటే ఎక్కువ వారి నుండి స్వీకరించబడిన చెల్లుబాటు అయ్యే బిడ్‌లకు లోబడి ఉంటుంది. యాంకర్ ఇన్వెస్టర్లు కాకుండా అన్ని సంభావ్య బిడ్డర్లు, సంబంధిత బిడ్ మొత్తాలు బ్లాక్ చేయబడే వారి సంబంధిత బ్యాంక్ ఖాతా బిడ్డర్ల వివరాలను అందించడం ద్వారా బ్లాక్ చేయబడిన మొత్తం ప్రక్రియ ద్వారా దరఖాస్తును తప్పనిసరిగా ఉ పయోగించుకోవాలి.



"కళ యొక్క లక్ష్యం వస్తువుల బాహ్య రూపాన్ని కాదు, వాటి అంతర్గత ప్రాముఖ్యతను సూచించడం."
అరిస్టాటిల్



"మీ పని మీ ప్రపంచాన్ని కనుగొనడం మరియు ఆపై మీ హృదయంతో దానికి మిమ్మల్ని మీరు అంకితం చేసుకోవడం."
బుద్ధుడు



"మీరు ఎప్పుడైనా చేపట్టే అత్యంత సృజనాత్మక చర్య మిమ్మల్ని మీరు సృష్టించుకునే చర్య."
దీపక్ చోప్రా

# వీధి కుక్కల వ్యవహారం మీకు పట్టదా?

● పలు రాష్ట్రాలపై సుప్రీంకోర్టు సీరియస్ ● చర్యల వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది
● తప్పుగా చిత్రీకరిస్తున్నారంటూ ధర్మాసనం ఆగ్రహం ● ఇప్పటికీ అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదని నిలదీత
● ఆయారాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు తదుపరి విచారణకు హాజరు కావాలని ఆదేశం



న్యూఢిల్లీ : వీధి కుక్కల కేసు వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. వాటిని శిబిరాలకు తరలించడంపై తీసుకున్న చర్యలను తెలియజేస్తూ పలు రాష్ట్ర ప్రభుత్వాలు అఫిడవిట్లు దాఖలు చేయలేదు. దీనిపై న్యాయస్థానం సీరియస్ అయ్యింది. స్పందించని వివిధ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు తదుపరి విచారణకు తమ ముందు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది.వీధి కుక్కలకు స్టెరిలైజేషన్పై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. వీధి కుక్కల దాడులపై ప్రతీరోజూ వార్తలు వస్తున్నా మీలో చలనం లేదా అంటూ అసహనం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఆగస్టు 22న ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయలేదని మండిపడింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు స్పందించని ప్రభుత్వాలపై గరంగరం అయ్యింది.దేశవ్యాప్తంగా వీధి కుక్కల అంశంపై దాఖలైన పలు పిటిషన్లను సోమవారం త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అనేక రాష్ట్రాలు వీధి కుక్కలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల నివేదికలను సమర్పించక పోవడాన్ని తప్పుబట్టింది. వీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఎందుకు నివేదిక దాఖలు చేయలేదని ప్రశ్నించింది.ఇలాంటి చర్యల వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోందని రాష్ట్రాల తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. అంతేకాదు వీటి విషయంలో భారత్ను చెడుగా చిత్రీకరిస్తున్నారని పేర్కొంది. అధికారులు వార్తాపత్రికలు చదవ లేదా? నివేదికలు సమర్పించని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు నవంబర్ మూడున న్యాయస్థానం ముందు హాజరు కావాలని ఆదేశించింది.శునకాల సమస్య కొన్నిప్రాంతాలకు పరిమితం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉందని గుర్తు చేసింది. ప్రజల భద్రతకు, పిల్లలు-వృద్ధుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా, ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించకపోవడాన్ని సరికాదని హితవు పలికింది. జంతువుల హక్కులను కాపాడుతూనే, మనుషుల భద్రతకు భరోసా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని తేల్చిచెప్పింది.

**ఇంకా చదవండి:** విద్యార్థిని మొబైల్ ఫోన్ తనిఖీ.. బుక్కైన ప్రిన్సిపాల్ ఈ విషయంలో పశ్చిమబెంగాల్, తెలంగాణ, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయి. మిగతా రాష్ట్రాలు అఫిడవిట్లు దాఖలు చేయలేదు. ఢిల్లీ విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ సమాధానం ఇచ్చిందని, ప్రభుత్వం నుంచి అఫిడవిట్ రాలేదని తెలిపింది.వీధి కుక్కల దాడులతో ఢిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరగడంపై వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకుంది సుప్రీంకోర్టు దిసభ్య ధర్మాసనం. రెండునెలల్లోగా వీటిని షెల్టర్లకు తరలించాలని ఆగస్టు 11న ఆదేశించిన విషయం తెల్సిందే.

# డిజిటల్ అరెస్ట్

● అత్యంత భయంకరమైన ముప్పు
● రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన
● ప్రొబేషనరీ ఐపీఎస్లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము



ప్రజ లు చాకచక్యంగా వ్యవహరించి పోలీసుల కు ఫిర్యాదు చేయాలని సూచన

దిల్లీ: డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ..భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్లో ప్రొబేషనరీ ఐపీఎస్లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు.సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి..తాము పోలీసులమని బెదిరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

# ఈశాన్య భారత రాష్ట్రాలతో బంగ్లాదేశ్ మ్యాప్

● ఇండియాపై విషం కక్కుతున్న యూనస్
● పాక్, బంగ్లా, చైనా దగ్గరవుతున్నాయంటూ కథనాలు



న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహ్మద్ యూనుస్ మరోసారి వివాదాన్ని రాచేశారు. భారత్లోని ఈశాన్య రాష్ట్రాలతో కూడిన బంగ్లాదేశ్ మ్యాప్ను పాక్ సైనిక ఉన్నతాధికారికి ఆయన బహూకరించారు. దీంతో 'గ్రేటర్ బంగ్లాదేశ్' కోసం పిలుపునిస్తున్న అతివాద ఇస్లామిక్ గ్రూపులకు బంగ్లా సర్కారు వంతపాడుతోందా అనే చర్చ మొదలైంది. వాస్తవానికి 2024 ఆగస్టులో బంగ్లాదేశ్ అధికార పీఠం ఎక్కినప్పటి నుంచే ఈశాన్య భారత రాష్ట్రాలపై మహ్మద్ యూనుస్ విషం కక్కుతున్నారు. ఇక ఇదే సమయంలో భారత్ విరోధులైన పాకిస్థాన్, చైనాలతో అంటకాగుతున్నారు.

**బంగ్లాదేశ్ తప్పుడు మ్యాప్పై నెటిజన్లు ఫైర్ :** 1971 సంవత్సరంలో పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని సాధించింది. ఈ విషయంలో బంగ్లాదేశ్కు సాయం చేసిన ఏకైక దేశం భారత్ మాత్రమే. అందుకే భారత్ - బంగ్లాదేశ్ మధ్య బలమైన సంబంధాలు ఉండేవి. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. పాకిస్థాన్కు బంగ్లాదేశ్ దగ్గరవుతోంది. ఈక్రమంలోనే గత వారం చివర్లో పాకిస్థాన్ ఆర్మీకి చెందిన జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్పర్సన్ జనరల్ సాహిర్ షంషాద్ మీర్జా బంగ్లాదేశ్లో పర్యటించారు. ఢాకా నగరం వేదికగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహ్మద్ యూనుస్తో ఆయన భేటీ అయ్యారు. ఇరుదేశాల సైనిక సంబంధాలపై వారు చర్చించారు. ఈసందర్భంగా జనరల్ సాహిర్ షంషాద్ మీర్జాకు బంగ్లాదేశ్ మ్యాప్తో పాటు 'ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్' పుస్తకాన్ని యూనుస్ బహూకరించారు. దీనికి సంబంధించిన ఫొటోలను యూనుస్ ట్వీట్ చేశారు. ఆ ఫొటోలను తరచి చూస్తే, బంగ్లాదేశ్ మ్యాప్లో భారతదేశంలోని అసోం సహా ఈశాన్య రాష్ట్రాలన్నీ ఉన్నాయి. దీన్ని చూసి భారతీయ నెటిజన్లు ఫైర్ అయ్యారు. బంగ్లాదేశ్ తప్పుడు మ్యాప్లను ఎందుకు ప్రింట్ చేస్తున్నారంటూ యూనుస్కు ప్రశ్నలు సంధించారు. అయితే ఈ అంశంపై భారత విదేశాంగ శాఖ ఇంకా స్పందించకపోవడం గమనార్హం. 'ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్' పుస్తకం విషయానికొస్తే, 2024 సంవత్సరం జులైలో బంగ్లాదేశ్లో జరిగిన విద్యార్థి ఉద్యమంపై ఈ బుక్కు రాశారు. ఈ ఉద్యమం వెనుక పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ హస్తం ఉందని అంటారు. నాడు విద్యార్థులు జరిపిన హింసాత్మక నిరసనల వల్ల, భారత్ను సమర్థించే షేక్ హసీనా సర్కారు కూలిపోయింది. ఫలితంగా భారత్, బంగ్లాదేశ్ మధ్య గ్యాప్ పెరిగింది.

**'ఈశాన్య భారత్'పై పదేపదే విషం కక్కుతున్న యూనుస్ :** ఈశాన్య భారత రాష్ట్రాలపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహ్మద్ యూనుస్ విషం కక్కడం ఇదే తొలిసారేం కాదు. గతంలో పలు అంతర్జాతీయ వేదికలపైనా దీని గురించి ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్లో తొలిసారిగా చైనాలో యూనుస్ పర్యటించారు. అక్కడ చేసిన ప్రసంగంలో ఈశాన్య భారత రాష్ట్రాలను ఆయన ప్రస్తావించారు. "ఈశాన్య భారతదేశంలోని 7 రాష్ట్రాల చుట్టూ భూమే ఉంది. అందువల్ల వాటికి సముద్ర మార్గంలో భద్రత కల్పించగల ఏకైక దేశం బంగ్లాదేశ్ మాత్రమే. ఇదొక పెద్ద అవకాశం. దీన్ని అదునుగా చేసుకొని మా ప్రాంతంలోకి చైనా తన ప్రభావాన్ని విస్తరించాలి. తద్వారా బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి" అని యూనుస్ ఆనాడు వ్యాఖ్యానించారు.

"భారత ఈశాన్య రాష్ట్రాలను చైనా ఆక్రమించుకోవాలి : ఈ ఏడాది మే నెలలో జమ్మూకశ్మీరులోని పహల్గామ్లో ఉగ్రదాడి జరిగిన వెంటనే, పాక్పై భారత్ ఎటాక్ చేస్తుందనే వార్తలు వచ్చాయి. ఆ సందర్భంగా మహ్మద్ యూనుస్ సన్నిహితుడు, బంగ్లాదేశ్ ఆర్మీ రిటైర్డ్ మేజర్ జనరల్ ఫజ్లుర్ రెహమాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాక్పై భారత్ దాడి చేస్తే, భారతదేశ ఈశాన్య రాష్ట్రాలను ఆక్రమించుకోవడానికి చైనాకు బంగ్లాదేశ్ సహకరించాలని ఆయన కామెంట్ చేశారు.

**'గ్రేటర్ బంగ్లాదేశ్' కోసం యూనుస్ సన్నిహితుడు :** 2024 సంవత్సరంలో యూనుస్ మరో సన్నిహితుడు నహీదుల్ ఇస్లాం బంగ్లాదేశ్ తప్పుడు మ్యాప్ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ మ్యాప్లో పశ్చిమ బెంగాల్, త్రిపుర, అసోంలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలన్నీ కలిపి 'గ్రేటర్ బంగ్లాదేశ్'ను ఏర్పాటు చేయాలని నహీదుల్ ఇస్లాం డిమాండ్ చేయడంతో భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ సోషల్ మీడియా పోస్ట్పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో అతడు దీన్ని డిలీట్ చేయాల్సి వచ్చింది.

**యూనుస్ మౌనం- పాక్, చైనాలతో దోస్తీ :** ఈవిధంగా భారత్ను రెచ్చగొట్టేలా తన సన్నిహితులు సోషల్ మీడియా పోస్టులు పెడుతున్నా, వ్యాఖ్యలు చేస్తున్నా యూనుస్ స్పందించడం లేదు. అవన్నీ పట్టనట్టుగా ఆయన వ్యవహరిస్తున్నారు. మరోవైపు భారత్ విరోధులైన చైనా, పాకిస్థాన్లకు చేరువయ్యే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

**'చికెన్స్ నెక్'పై కన్ను- ఘాటుగా స్పందించిన భారత్ :** 'చికెన్స్ నెక్ కారిడార్' భారత్కు చాలా ముఖ్యమైంది. ఇది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఉత్తర ప్రాంతం సరిహద్దుల్లో ఉంది. 'చికెన్స్ నెక్ కారిడార్' మీదుగానే ఈశాన్య రాష్ట్రాలతో భారత్ కనెక్ట్ అవుతుంది. 'చికెన్స్ నెక్ కారిడార్' పక్కనే బంగ్లాదేశ్ ఉంటుంది. ఈ కారిడార్ను తెంచి, ఈశాన్య రాష్ట్రాలకు భారత్ను దూరం చేయాలనే కోణంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహ్మద్ యూనుస్ సన్నిహితులు ఎన్నో వ్యాఖ్యలు చేశారు. వీటిపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చికెన్స్ నెక్ కారిడార్' అనేది బంగ్లాదేశ్, భూటాన్, భారతదేశం, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయిలాండ్లతో కూడిన 'బిమ్స్టెక్' కూటమిలోని దేశాలకు కీలకమైన కనెక్టివిటీ హబ్ అని తెలిపారు. బంగ్లాదేశ్ వివాదాస్పద వైఖరి నేపథ్యంలో భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. నేపాల్, భూటాన్, మయన్మార్లకు భారత్ మీదుగా బంగ్లాదేశ్ వస్తువులను చేరవేసే ట్రాన్స్షిప్మెంట్ ఒప్పందాన్ని రద్దు చేసింది.

# రాహుల్ గాంధీ నాకు సోదరుడు

## రాహుల్ నన్ను 'మై డియర్ బ్రదర్' అని పిలుస్తారన్న స్టాలిన్



చెన్నై : కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని తప్ప తాను ఎవరినీ సోదరుడిగా పిలవనని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ఆయన కూడా తనను 'మై డియర్ బ్రదర్' (నా ప్రియమైన సోదరుడా) అని పిలుస్తారని తెలిపారు. విరుధ్నగర్ జిల్లాలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."1967కు ముందు ఆత్మగౌరవ వివాహాలకు చట్టబద్ధమైన గుర్తింపు లేదు. కానీ ఆ సమయంలో అన్నా నేతృత్వంలోని డీఎంకే అధికారంలోకి వచ్చాక ఆత్మగౌరవ విహాలకు చట్టబద్ధత కల్పించారు. డీఎంకే, కాంగ్రెస్ వేర్వేరు మార్గాల్లో నడిచినా, ఇప్పుడు రెండు పార్టీలు కలిసి పని చేస్తున్నాయి. దేశ, తమిళనాడుకు మంచి భవిష్యత్ కోసం ఒకే జట్టుతో కలిసి ఆలోచనలతో ఉన్నాయి. నా సోదరుడు రాహుల్ గాంధీపై ఉన్న ప్రేమను మాటల్లో వర్ణించలేను. ఇతర పార్టీల నేతలను కలిసినప్పుడు మాట్లాడినప్పుడు నేను ఎవరినీ సోదరుడని పిలవను. కానీ రాహుల్ గాంధీ గురించి మాట్లాడినప్పుడు మాత్రం సోదరుడినే పిలుస్తాను. ఇందుకు కారణం ఆయన నన్ను సోదరుడిగానే భావించడం. మేము ఇద్దరం కలిసినా, ఫోన్లో మాట్లాడుకున్నా మై డియర్ బ్రదర్ అని పిలుస్తాను. నేను ఎప్పుడు మరిచిపోను. ఇది కేవలం రాజకీయ స్నేహమే కాదు విధానపరంగా ఏర్పడింది. భారత్ భవిష్యత్ కోసం ఆయన తన గొంతను వినిపిస్తూనే ఉంటారు. ప్రతీ ఒక్కరి నుంచి ఇలాంటి పద్ధతిని ఆశిస్తున్నా. మా ఇద్దరి మధ్య స్నేహం ఈరోజుకీ కొనసాగతూనే ఉంది. వ్యక్తిగత ప్రయోజనాల కన్నా దేశ ప్రయోజనాలే ముఖ్యం." అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు.అంతకుముందు గతేడాది అమెరికా పర్యటనలో కూడా ఇద్దరు నేతల మధ్య సరదా సంభాషణ జరిగింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ షికాగో సరస్సు తీరంలో సైకిల్ తొక్కిన వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, చెన్నైలో మనమిద్దరం కలిసి ఎప్పుడు సైక్లింగ్ చేద్దాం మిత్రమా అంటూ ట్వీట్ చేశారు. దీనికి బదులిచ్చిన సీఎం స్టాలిన్ "డియర్ బ్రదర్ మీకు ఎప్పుడు వీలుంటే అప్పుడు సైకిల్ తొక్కుతూ చెన్నై నగరాన్ని చుట్టేద్దాం. దీంతోపాటు మీకోసం మిఠాయిలు కూడా వేచిచూస్తున్నాయి. సైక్లింగ్ తర్వాత మా ఇంట్లో దక్షిణాది వంటకాన్ని ఆస్వాదించి స్వీట్ల రుచి చూద్దాం" అని స్టాలిన్ చెప్పారు. దీనికి సంబధించిన ఆన్లైన్ సంభాషణ కాస్త సోషల్ మీడియాలో వైరల్గా మారింది. ఇలానే గతేడాది జూన్ 19న రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతకు స్టాలిన్ శుభాకాంక్షలు చెప్పిన సమయంలో సరదా సంభాషణ నెలకొంది. స్టాలిన్కు ధన్యవాదాలు తెలిపిన రాహుల్, మీ నుంచి స్వీట్ బాక్స్ కోసం వేచిచూస్తున్నానని చెప్పారు.

# అంతా 'శ్రీరామ'మయం

● ఉత్తర అమెరికా ట్రినిడాడ్ అండ్ టొబాగోలో 'అయోధ్య నగరి' నిర్మాణం ● భారీ రామ మందిరాన్ని నిర్మించనున్న కరేబియన్ దేశం ● భారత్లోని అయోధ్య వరకు వెళ్లలేని రామభక్తుల కోసమేనంటున్న అధికారులు
● భారీగా నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు



అయోధ్య : ఓ చిన్న కరీబియన్ దేశంలో భవ్య రామమందిరాన్ని నిర్మించబోతున్నారు. అక్కడ కూడా ఓ 'అయోధ్యా నగరి' వెలియబోతోంది. భారత్లోని అయోధ్య దాకా వెళ్లలేని ఉత్తర అమెరికా రామభక్తులకు ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశంలో రామయ్య దర్శనమివ్వనున్నారు. ఈ ఆలయ నిర్మాణం దిశగా అడుగులు ఎలా పడుతున్నాయి? ఆ దేశ ప్రభుత్వం, ప్రజల నుంచి ఎలాంటి సహకారం లభిస్తోంది? ఈ కథనంలో తెలుసుకుందాం.

**3.50 లక్షల మంది హిందువులే!**

కరీబియన్ సముద్రపు సరిహద్దుల్లో 13 చిన్నచిన్న దేశాలు ఉన్నాయి. వాటిలోనే ఒకటి ట్రినిడాడ్ అండ్ టొబాగో. ఇందులో ట్రినిడాడ్, టొబాగో అనే రెండు ప్రధాన ద్వీపాలు ఉన్నాయి. 'పోర్ట్ ఆఫ్ స్పెయిన్' నగరం ఈ దేశపు రాజధాని. ట్రినిడాడ్ అండ్ టొబాగోకు టూరిజమే ప్రధాన ఆదాయ వనరు. ఈ దేశంలో దాదాపు 14 లక్షల జనాభా ఉండగా, వారిలో ఇంచుమించు 3.50 లక్షల మంది హిందువులే. అందుకే హిందువుల మనోభావాలను, సంప్రదాయాలను అక్కడి ప్రభుత్వం గౌరవిస్తుంది. 19వ శతాబ్దంలో భారతీయులు పెద్దసంఖ్యలో ఈ దేశానికి వలస వెళ్లి, అక్కడే స్థిరపడిపోయారు. ప్రస్తుతం ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధానమంత్రిగానూ భారత సంతతికి చెందిన కమలా పెర్సాద్ బిస్సేస్సార్ సేవలు అందిస్తున్నారు. పబ్లిక్ యుటిలిటీస్ శాఖ మంత్రిగానూ భారత సంతతికి చెందిన బ్యారీ శివ పాదరత్ ఉన్నారు.

**రామ్లల్లా విగ్రహ నమూనా ఆవిష్కరణ :** అమెరికాలోని న్యూయార్క్కు చెందిన ప్రేమ్ భండారీ 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ రామ్ మందిర్' (ఓఎఫ్ఆర్ఎం) అనే సంస్థను నడుపుతున్నారు. ఈ సంస్థ ట్రినిడాడ్ అండ్ టొబాగో సహా చాలా దేశాల్లో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అయోధ్య రామమందిరం తరహాలో ట్రినిడాడ్ అండ్ టొబాగోలోనూ రామ మందిరాన్ని నిర్మించాలని ప్రేమ్ భండారీ ముమ్మర ప్రచారం చేశారు. ఈ ఆలయం నిర్మాణం జరిగితే, అయోధ్య దాకా వెళ్లలేని ఉత్తర అమెరికా రామ భక్తులంతా ట్రినిడాడ్ అండ్ టొబాగోకు వచ్చి రామయ్యను దర్శించుకుంటారనే విషయాన్ని జనంలోకి తీసుకెళ్లారు.దీనివల్ల ఆధ్యాత్మిక టూరిజం పెరుగుతుందనే అంశాలతో కూడిన నివేదికను ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రభుత్వానికి సమర్పించారు. ఈ ప్రయత్నాల ఫలితంగా ఈ ఏడాది ఆరంభంలోనే రామ్లల్లా విగ్రహ నమూనా అయోధ్య నుంచి ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చేరింది. ఈ ఏడాది మే నెలలో దేశ రాజధాని పోర్ట్ ఆఫ్ స్పెయిన్లో రామ్లల్లా విగ్రహ నమూనాను ప్రేమ్ భండారీ, అయోధ్య శ్రీరామ్ ఆర్గనైజేషన్ ఛైర్పర్సన్ అమిత్ అలఘ్ కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 10వేల మందికిపైగా రామభక్తులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి ప్రభుత్వం మద్దతు : భవ్య రామమందిర నిర్మాణానికి తమ ప్రభుత్వం మద్దతు తప్పక ఉంటుందని ట్రినిడాడ్ అండ్ టొబాగో పబ్లిక్ యుటిలిటీస్ శాఖ మంత్రి బ్యారీ శివ పాదరత్ వెల్లడించారు. అయోధ్య నుంచి రామ్ లల్లా విగ్రహ నమూనాను తీసుకొచ్చిన వారితో పాటు స్థానిక హిందూ మత పెద్దలతో ఆలయ నిర్మాణ ప్రతిపాదనల గురించి చర్చిస్తున్నట్లు తెలిపారు. భారతదేశం అవతల హిందూ సంప్రదాయాల పరిరక్షణ కోసం చొరవ చూపుతున్న సంస్థలకు తమ మద్దతు ఉంటుందని ఆయన చెప్పారు. కరీబియన్ దేశాల్లో హిందూ ఆలయాలకు నెలవుగా ట్రినిడాడ్ అండ్ టొబాగోను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. రామమందిర నిర్మాణం వల్ల దేశ పర్యాటకం సైతం పెరుగుతుందన్నారు. ఆ మందిరాన్ని సాంస్కృతిక ప్రచారం, హిందూవర్గ సమావేశాలు, ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఉపయోగించుకోవచ్చని బ్యారీ శివ పాదరత్ తెలిపారు. ఉత్తర అమెరికా ప్రాంతంలోని ప్రవాస భారతీయులంతా భవిష్యత్తులో తమ దేశంలోని రామాలయాన్ని దర్శించుకోవచ్చన్నారు. కాగా, రామమందిరంని.

# సీజేఐపై దాడి చేసిన లాయర్పై

## కోర్టు ధిక్కార చర్యలకు అనుమతించబోం: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు లో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై ఓ న్యాయవాది దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్పై కోర్టు ధిక్కార చర్యలకు అనుమతించబోమని సుప్రీం కోర్టు వెల్లడించింది. ఈ విషయంపై సీజేఐ ఎటువంటి కేసు నమోదు చేయలేదని.. అతడిపై చర్యలు తీసుకోవడానికి భారత ప్రధాన న్యాయమూర్తి విముఖత చూపారని తెలిపింది. సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.కోర్టులో నినాదాలు చేయడం, బూట్లు విసిరేయడం వంటి చర్యలు కోర్టు ధిక్కారానికి సంబంధించిన కేసులని.. అయితే వీటిపై చట్టం ప్రకారం ముందుకు వెళ్లాలా, వద్దా అనేది సంబంధిత న్యాయమూర్తిపై ఆధారపడి ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ధిక్కార నోటీసులు జారీ చేయడం వల్ల సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదికి అనవసర ప్రాధాన్యం కల్పించినట్లు అవుతుందని అభిప్రాయం వ్యక్తంచేసింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తామని సుప్రీం వెల్లడించింది. ఇటీవల ఓ కేసు విచారణ సమయంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్పై లాయర్ కిశోర్ తన కాలి బూటుతో దాడికి యత్నించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై దాన్ని అడ్డుకొని అతడిని బయటకు తరలించారు. ఈ క్రమంలో ఆయన 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీజేఐ స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవన్నారు. ఈ ఘటనను ప్రధాని మోదీతో సహా పలు రాజకీయ పార్టీల అగ్రనేతలు.

# 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రారంభిస్తున్నాం

## ఎస్ఐఆర్ రెండోదశపై సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రకటన




న్యూఢిల్లీ : దేశంలో రెండో విడత సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ను మంగళవారం నుంచి చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మొత్తం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రెండో విడత ఎస్ఐఆర్ చేపడతామని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం నుంచి ఉత్తర్ప్రదేశ్, బంగాల్, రాజస్థాన్, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్గఢ్, గోవా, గుజరాత్, పుదుచ్చేరి, అండమాన్, లక్షద్వీప్లో నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. డిసెంబరు 9న ముసాయిదా ఎస్ఐఆర్ జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని వివరించారు. దేశంలో ఇప్పటివరకు 8సార్లు సమగ్ర ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్న ఆయన, గత 20 ఎళ్ల నుంచి ఇప్పటివరకూ ఒక్కసారి కూడా జరగలేదని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఆవశ్యకతను సిఈసి వివరించారు.ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్కు కొందరు సహాయకులు ఉంటారు. జాబితా ప్రకటించాక ప్రతి ఒక్కరికీ అప్పీల్ చేసే అవకాశం ఉంటుంది. ప్రతి ఓటరుకు ఇన్యుమరేషన్ ఫామ్ అందుబాటులో ఉంటుంది. ప్రధానంగా 4 రకాల కారణాలతో ఓటర్ల తొలగింపు ఉంటుంది. అర్హులైన ఓటర్లే జాబితాలో ఉంటారు. అనర్హులను తొలగిస్తాం. 6 జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీ నేతలతో భేటీ ఏర్పాటు చేస్తాం. ఒక్కో అధికారి రోజుకు 50 ఇన్యుమరేషన్ ఫామ్లు పరిశీలిస్తారు. ఇన్యుమరేషన్ ఫామ్లు పరిశీలించాక ఓటరు జాబితా డ్రాఫ్ట్ ప్రకటిస్తాం. ఓట్లు తొలగించిన వారి పేర్లను స్థానిక కార్యాలయాల్లో ప్రదర్శిస్తాం అని కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, అన్నారు.

# సుప్రీం తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

● కేంద్రానికి జస్టిస్ గవాయ్ సిఫార్సు
● నవంబర్ 24నే 53వ సీజేఐగా బాధ్యతలు



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. జస్టిస్ సూర్యకాంత్ను సీజేఐగా నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రతిపాదన చేశారు. ప్రస్తుత సీజేఐ పదవీకాలం నవంబర్23వ తేదీన ముగియనుంది. నవంబర్ 24న 53వ సీజేఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు.సీజేఐ పదవీ విరమణకు నెల రోజుల ముందుగా తదుపరి ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియను ప్రారంభించడం సంప్రదాయంగా వస్తోంది. సాధారణంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో అత్యంత సీనియర్ను ఈ పదవి వరిస్తుంది. ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో అత్యంత సీనియర్ జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. ఈ క్రమంలో జస్టిస్ సూర్యకాంత్ పేరును సీజేఐ జస్టిస్ గవాయ్ ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. రాష్ట్రపతి అధికారికంగా నియమించిన తర్వాత నవంబర్ 24న జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం చేయనున్నారు. దాదాపు 15 నెలల పాటు అంటే 2027 ఫిబ్రవరి 9 వరకు పదవిలో కొనసాగనున్నారు.జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1981లో అక్కడి ప్రభుత్వ పోస్ట్గ్రాడ్యుయేట్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1984లో రోహ్తక్లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీలో లా డిగ్రీ పట్టా అందుకున్నారు. అనంతరం హిసార్లోనే న్యాయవాద వృత్తి మొదలుపెట్టారు. 1985లో పంజాబ్ హరియాణా హైకోర్టులో ప్రాక్టీసు చేయడం కోసం ఛండీగఢ్కు వెళ్లారు. ఆ తర్వాత 2000 జులై 7న అత్యంత పిన్నవయస్సులో హరియాణా అడ్వొకేట్ జనరల్గా నియమితులయ్యారు. 2004 జనవరి 9న పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 2018 అక్టోబరు 5న హిమాచల్ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019 మే 24న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి అందుకున్నారు. దీంతో పాటు 2024 నవంబరు 12 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్గా పనిచేస్తున్నారు.

**కీలక తీర్పులు :** జస్టిస్ సూర్యకాంత్ దాదాపు రెండు దశాబ్దాల పాటు సేవలు అందించారు. ఆర్టికల్ 370 రద్దు, వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, అవినీతి నిర్మూలన, లింగ సమానత్వం వంటి అంశాలపై కీలకమైన తీర్పులు ఇచ్చారు. రాజద్రోహ చట్టాన్ని నిలిపివేయాలని చెప్పిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ కూడా ఉన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను ప్రోత్సహిస్తూ, సూర్యకాంత్ జస్టిస్ బిహార్లో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనంతరం, డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో తొలగించబడిన 65 లక్షల పేర్ల వివరాలు ప్రజలకు వెల్లడించాలంటూ ఎన్నికల కమిషన్ను ఆదేశించారు. సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్తో సహా అన్ని న్యాయవాద సంఘాలలో మహిళలకు మూడో వంతు స్థానాలను కేటాయించాలని ఆదేశించిన ఘటన కూడా జస్టిస్ సూర్యకాంత్. ఈ తీర్పు న్యాయరంగంలో లింగ సమానత్వానికి దారితీసిన కీలక అడుగుగా పరిగణించబడింది.వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకాన్ని ఆయన సమర్థించారు. రాష్ట్రపతి అధికారికంగా నియమించిన తర్వాత నవంబర్ 24న జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం చేయనున్నారు. దాదాపు 15 నెలల పాటు అంటే 2027 ఫిబ్రవరి 9 వరకు పదవిలో కొనసాగనున్నారు.జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ప్రస్తుతం ఆయన సైన్యంలో మహిళా అధికారుల స్థిర నియామక హక్కులపై పిటిషన్లు కూడా విచారిస్తున్నారు. 1976 అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ తీర్పును కొట్టివేసిన ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. తద్వారా ఆ విశ్వవిద్యాలయానికి మైనారిటీ హోదాపై పునర్విచారణకు మార్గం సుగమమైంది. సూర్యకాంత్ పెగాసస్ స్పైవేర్ గూఢచారి సాఫ్ట్వేర్ కేసు విచారణలో భాగమయ్యారు.తర్వాత 2000 జులై 7న అత్యంత పిన్నవయస్సులో హరియాణా అడ్వొకేట్ జనరల్గా నియమితులయ్యారు. 2004 జనవరి 9న పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 2018 అక్టోబరు 5న హిమాచల్ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019 మే 24న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి అందుకున్నారు. ఆయన నేతృత్వంలోని బెంచ్, సైబర్ నిపుణుల కమిటీని నియమించింది. జాతీయ భద్రత పేరుతో ఉచిత పాస్ పొందలేమని పేర్కొంది. 2022లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో జరిగిన భద్రతా లోపంపై దర్యాప్తు చేసేందుకు నియమించిన కమిటీలో జస్టిస్ కుమార్ కూడా ఉన్నారు.

## దూసుకొస్తున్న 'మొంథా' తుపాను

# ఏపీకి రెడ్ అలెర్ట్

**తుపాను తీరాన్ని తాకే సమయంలో గంటకు 90-100 కి.మీ. వేగంతో గాలులు**

**మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం**

**మచిలీపట్నం, కృష్ణపట్నం, నిజాంపట్నం పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ**

**సీఎం చంద్రబాబుకు ప్రధాని మోడీ ఫోన్**



**ఏపీకి మొంథా తుఫాన్ కోస్తా జిల్లాలపై దూసుకొస్తుంది. ఆగ్నేయ బంగాళఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. ఈరోజు ఉదయం నైరుతి పశ్చిమ మధ్య బంగాళఖాతంలోని తుఫాన్ బలపడిందని ఐఎమ్డీ తెలిపింది. మంగళవారం ఉదయానికి తీవ్ర తుఫానుగా మారనుంది. ఇక అదే రోజు రాత్రి కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని అంచనా వేసింది. మంగళవారం దాదాపు 12 గంటల తీవ్రత కొనసాగుతోందని ఐఎమ్డి సూచించింది. తరువాత తుఫానుగా బలహీన పడవచ్చని పేర్కొంది. దీని ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో.. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. మరిన్ని వివరాలలోకి వెళితే...**

***బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను కారణంగా ఏపీ-తెలంగాణల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం, బుధవారాల్లో వివిధ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పలు జిల్లాలపై తీవ్రంగా ఉన్నట్లు ఐఎమ్డీ వెల్లడించింది. 7 జిల్లాలకు రెడ్ అలర్ట్, 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మరో 3 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే మంగళవారం 14 జిల్లాలకు రెడ్ అలర్ట్, 8 జిల్లాలకు ఆరెంజ్, నాలుగు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని.. విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం సూచించింది. విశాఖపట్నం, మచిలీపట్నం, కృష్ణ పట్నం, నిజాంపట్నం, గంగవరం, కాకినాడ పోర్టుల్లో 1వ నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీచేసింది.***

**మొంథా గండం – అంతా అప్రమత్తం! :** మొంథా తుపాను శ్రీకాకుళం జిల్లాలో 28, 29 తేదీల్లో తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరించింది. రెండు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురవడంతో పాటు గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని అధికారులు చెబుతున్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. వరి కోతలు నాలుగు రోజులు ఆపాలని చెబుతున్నారు. తుపాను పర్యవేక్షణకు ప్రభుత్వం ఐఏఎస్ సీనియర్ అధికారి కేవీఎన్ చక్రధరబాబును ప్రత్యేకాధి కారిగా నియమించింది. తుపాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేశారు. క్షేత్రస్థాయి లో సిబ్బంది అప్రమత్తంగాఉండాలని, ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి అచ్చెన్నాయుడు ఇన్‌ఛార్జి కలెక్టర్, ఎస్పీల తో పాటు జలవనరులశాఖ, విద్యుత్తు అధికారులతో మాట్లాడారు. ఎలాంటి సమాచారమైనా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నంబరు 08942-240557 కు తెలియజేయాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వంశధార, జలవన రుల శాఖ కార్యాలయాల్లోనూ ప్రత్యేక కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. ఎస్ఈలు రామచంద్రరావు, పొన్నాడ సుధాకర్ వీటిని పర్యవేక్షించనున్నారు. ఇక్కడ మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధుల్లో ఉంటారు. భారీ వర్షాలు, వరదలతో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను నేరుగా తెలియజేయొచ్చని సంబంధిత అధికారులు సూచించారు.



### సీఎంతో ఫోన్లో ప్రధాని మోదీ

మొంథా తుపాను ప్రభావంపై సీఎం చంద్రబాబుతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం ప్రధానికి వివరించారు. ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి లోకేశ్కు సీఎం సూచించారు.

### రాబోయే 5 రోజుల్లో వర్షాలు

కురిసే అవకాశం: దీని ప్రభావం కారణంగా రానున్న 5 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. నేడు బాపట్ల, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు, ఆదివారం గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పల్నాడు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

**ఎదుర్కొనేందుకు మేమంతా సిద్ధం:** మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాల యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది. కలెక్టరేట్ల నుంచి క్షేత్రస్థాయి అధికారులతో కలక్టర్లు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

**చేపట్టిన చర్యలు:** జేసీబీలు, క్రేన్‌లను అందుబాటులో ఉంచారు. నదులు, కాజ్‌వేలు ఉధృతంగా పారే అవకాశం ఉన్న చోట ప్రత్యేక సిబ్బందిని నియమించారు. సముద్రతీర ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలకు సందర్శకులకు అనుమతి ఇవ్వడం లేదు. ప్రజలకు సూచనలు ఇలా: తుపాన్ ప్రభావంతో భారీగా గాలులు వీచే అవకాశం ఉంది. హోర్డింగ్, చెట్ల వద్ద ఎవరూ ఉండొద్దు. తీర ప్రాంతాల ప్రజలు ఈ నెల 29 వరకు అత్యవసర పరిస్థితిల్లో తప్ప, ప్రయాణాలు చేయొద్దు అని అధికారులు సూచించారు.



**పోలీసు శాఖ ఆధ్వర్యంలో:** నీటి ప్రవాహం అధికంగా ఉన్న చోట, అత్యవసర సమయాల్లో సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశించారు. సిబ్బంది కోసం రేడియం స్టిక్కర్ జాకెట్లు, రెయిన్ కోట్లు అందుబాటు లో ఉంచామని ఎస్పీ తెలిపారు.

**విద్యుత్తు శాఖ:** ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ పలుమార్లు విద్యుత్తు శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో యుద్ధ ప్రాతిపదికన సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ఈ జాగ్రత్తలు తీసుకోండి



సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు నమ్మవద్దు.
ప్రజలందరూ భయపడకుండా ప్రశాంతంగా ఉండాలి.
అత్యవసర కమ్యూనికేషన్ కోసం మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసుకుంటూ ఉండాలి.
వాతావరణ హెచ్చరికల కోసం ఎస్ ఎంఎస్ లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.
ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్చాప్ చేయాలి. అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలు, గ్యాస్ కనెక్షన్లను తీసి వేయాలి. తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.
మీ భద్రత, మనుగడ కోసం అవసరమైన వస్తువులతో అత్యవసర వస్తు సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలి.
ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలి.
మీ పత్రాలు, సర్టిఫికెట్లు, విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచుకోవాలి.
మీ ఇళ్లు సురక్షితం కాకపోతే తుపాను ప్రారంభం కాకముందే సురక్షితమైన ఆశ్రయానికి చేరుకోవాలి.
పాత భవనాలు, చెట్లు, విద్యుత్తు తీగలు, స్తంభాల కింద ఎప్పుడూ ఉండకూడదు.
పశువులు, పెంపుడు జంతువులకు కట్టిన తాడును విప్పి వాటిని వదిలేయాలి.

**కంట్రోల్ రూమ్ నంబర్లు ఏర్పాటు:** ఏపీలో అల్పపీడనం తుపానుగా బలపడతుండటంతో అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. ఈ అల్పపీడనం తుపానుగా బలపడుతుందని, భారీ వర్షాలు, అతిభారీ వర్షాలు ఉంటాయని అధికారులు తెలిపారు. సోమ, మంగళవారాల్లో అత్యంత భారీ వర్ష సూచన ఉంటుందని మంత్రికి వివరించారు. అయితే తుపాను తీవ్రతను అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అలెర్ట్ చేయాలని మంత్రి అనిత అధికారులకు సూచించారు. ముందస్తుగా పటిష్ట జాగ్రత్త చర్యలు అమలు చేయాలని ఆదేశించారు. ఇంకా ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని మంత్రి అనిత చెప్పారు.
క్షేత్రస్థాయిలో యంత్రాంగం మరింత అలెర్టా ఉండాలని అధికారులను సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అలానే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆహారం అందించాలని ఆదేశించారు. భారీ వర్షాల దృష్ట్యా వీలైనంత వరకు ప్రజలు ఇంట్లోనే ఉండాలని మంత్రి చెప్పారు. ఏదైనా ఆపద వస్తే విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్ నంబర్లు 112, 1070, 18004250101 ఇచ్చారు. మండల స్థాయి, డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రత్యేక అధికారులను నియమించారు.

**సహాయక చర్యల కోసం రూ.19 కోట్లు విడుదల:**
"మొంథా" తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను ప్రభావం దృష్ట్యా అధికారులకు సెలవులు రద్దు చేశారు. ప్రభుత్వం సహాయక చర్యల కోసం రూ.19 కోట్లు విడుదల చేసింది. ఎస్డీఆర్ఎఫ్, ఏపీఎస్డీఎంఏ కేంద్రాలు, 16 శాటిలైట్ ఫోన్లు ఏర్పాటు చేశారు. 57 తీర ప్రాంత మండలాల పరిధిలో 219 తుపాను షెల్టర్లు ఏర్పాటు చేశారు. సముద్రంలోని 62 మెకనైజ్డ్ బోట్లను ఒడ్డుకు రప్పిస్తున్నారు. సముద్ర తీరాల్లో పర్యాటకుల రాకపోకలపై నిషేధం విధించారు.

**విద్యా సంస్థలకు సెలవులు:** అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, కడపలో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు.

**తుపాను జిల్లాల్లో విపత్తు బృందాలు :** మోహరించాయి. సహాయక చర్యల కోసం 9 ఎస్డీఆర్ఎఫ్, 7 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచారు. తుపాను దృష్ట్యా జిల్లాలకు టీఆర్-27 కింద నిధులు మంజూరు చేశారు. వీటితో సహాయ శిబిరాలు, తాగునీరు, ఆహర ఏర్పాట్లు చేస్తున్నారు. మొంథా తుపాను వేళ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

**గొట్టిపాటి నాగేశ్వరరావు**
**ఏపి బ్యూరో ప్రత్యేక ప్రతినిధి - 70360 00444**

#### మచిలీపట్నం, కృష్ణపట్నం, నిజాంపట్నం పోర్టుల్లో

### ముందస్తు హెచ్చరికలు జారీ



1, 2వ నంబరు హెచ్చరికలు: ఇవి కేవలం జాగ్రత్త సూచనలు మాత్రమే. తుపాను ఒక పోర్టుకి 400 నుంచి 750 నాటికల్ మైళ్లు దూరంలో ఉన్నప్పుడు 1వ, 2వ నంబరు హెచ్చరికలు జారీ చేస్తారు. ఇవి తక్షణ ప్రమాద సూచనలు కావు. కానీ ముందుగా జాగ్రత్తలు తెలియజేయడానికి జారీ చేస్తారు.
3, 4వ నంబరు హెచ్చరికలు: ఈ హెచ్చరికలు జారీ చేస్తే అప్రమత్తంగా ఉండాలి. తుపాను 150 నుంచి 400 నాటికల్ మైళ్లు దూరంలో ఉన్నప్పుడు 3వ, 4వ నంబరు ప్రమాద హెచ్చరికలు ప్రకటిస్తారు. ఇవి తుపాను పోర్టుకు దగ్గర పడే అవకాశం ఉందని సంకేతం.
5, 6వ నంబరు హెచ్చరికలు: ఇక్కడ నుంచి ప్రమాద సూచికలు ప్రారంభం అవుతాయి. తుపాను 50 నుంచి 150 నాటికల్ మైళ్లు దూరంలో ఉన్నప్పుడు 5వ, 6వ నంబరు హెచ్చరికలు జారీ చేస్తారు. ఈ సమయంలో గాలులు బలంగా వీస్తాయి, అలలు ఎగిసిపడతాయి. పోర్టు పరిసరాల్లో ప్రభావం స్పష్టంగా కనిపించడం మొదలవుతుంది. ఈ నంబర్ల హెచ్చరికలు జారీ చేస్తే, పోర్టులోని అన్ని కార్యకలాపాలన్నీ నిలిపేయాలి.
8 నుంచి 10వ నంబరు హెచ్చరికలు: ఈ నంబర్ హెచ్చరికలు అత్యంత ప్రమాద స్థాయిని తెలియజేస్తుంది. తుపాను 50 నాటికల్ మైళ్లు లోపల ఉన్నప్పుడు 8, 9, 10వ నంబరు హెచ్చరికలు జారీ చేస్తారు. తుపాను నేరుగా పోర్టు, సమీప తీరానికి తాకే ప్రమాదం ఉందని అర్థం. ఈ దశలో గాలి వేగం 80 కి.మీ. నుంచి 200 కి.మీ. వరకు ఉంటుంది. ఈ సమయం లో పోర్టు పూర్తిగా మూసివేయాలి. నౌకలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. ఎమర్జెన్సీ రెస్క్యూ టీంలను సిద్ధం చేయాలి. అదే విధంగా పోర్టు మొత్తం ఖాళీ చేయాలి.
11వ నంబరు హెచ్చరిక: ఇది అత్యవసర స్థితి. 11వ నంబరు హెచ్చరిక అంటే తుపాను పోర్టు సమీపంలోనే ఉందని, తీవ్రమైన గాలులు వీస్తాయని అర్థం. ఈ హెచ్చరిక వచ్చిందంటే సమాచార వ్యవస్థలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. విద్యుత్, కమ్యూనికేషన్, రవాణా అంతరాయం కలుగుతుంది. ప్రజలు, సిబ్బంది సురక్షిత ప్రదేశాల్లో ఉండాలి.
తుపానుల సమయంలో కేంద్ర ప్రభుత్వం, భారత వాతావరణ విభాగం జారీ చేసే సూచనల ప్రకారం పోర్టు కార్యకలాపాలు నిర్వహిస్తామని కాకినాడ యాంకరేజ్ పోర్టు అధికారి ధర్మశస్త్ర తెలిపారు. ప్రతి నంబరు హెచ్చరిక వెనుక నిర్దిష్ట అర్థం ఉంటుందని, వాటిని ఖచ్చితంగా పాటించడం వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని అన్నారు. పోర్టుల వద్ద ఈ ప్రత్యేక సిగ్నల్ వ్యవస్థ ఉంటుంది. తద్వారా తుపాను ప్రభావాన్ని గుర్తించి, హెచ్చరికలు జారీ చేస్తారు. తుపానుల తీవ్రతను బట్టి 1 నుంచి 11 వరకు ఉన్న ఈ హెచ్చరికల వ్యవస్థ తీర ప్రాంత ప్రజలు, అదే విధంగా మత్స్యకారుల భద్రతకు కీలకమైనది. మత్స్యకారులు, పోర్టు అధికారులు, తీరప్రాంత ప్రజలు ఈ సూచనల అర్థం తెలుసుకుంటే ముందుగానే అప్రమత్తం కావచ్చు. తుపాను ప్రభావం నుంచి సురక్షితంగా బయటపడవచ్చు.

సూర్య
suryachitramagazine@gmail.com
విజయవాడ
మంగళవారం
28 అక్టోబర్ 2025



# సూర్య సినిమా

## మీసాల పిల్ల వైరల్ సెన్సేషన్, 36 మిలియన్ వ్యూస్



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకర వర ప్రసాద్ గారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ మీసాల పిల్లతో మెగాస్టార్ చిరంజీవి ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ ఎనర్జిటిక్ మెలోడీ ఇన్స్టంట్ చార్ట్‌బస్టర్‌గా మారడమే కాకుండా, తెలుగు పాటకు దేశవ్యాప్తంగా అరుదైన ఘనతను సాధించింది. విడుదలైన కొద్ది రోజుల్లోనే, మీసాల పిల్ల యూట్యూబ్ మ్యూజిక్ ఇండియాలో నంబర్ 1 స్థానానికి చేరుకుంది, వరుసగా 13 రోజులు అగ్రస్థానాన్ని కొనసాగించి 36 మిలియన్లకు పైగా వ్యూస్ సంపాదించింది. ఈ పాట పాన్-ఇండియా సంచలనంగా మారింది, నేషనల్ మ్యూజిక్ స్టేజ్ పై తెలుగు సినిమాకు ఇది ప్రౌడ్ మూమెంట్. మన శంకర వర ప్రసాద్ గారు పండుగ వాతావరణంలో కుటుంబ భావోద్వేగాలు, వినోదం, నాస్టాల్జియాతో నిండిన ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. "మీసాల పిల్ల" పాట చిరంజీవి గారి టైమ్‌లెస్ చార్మ్, అద్భుతమైన డాన్స్ మూవ్స్, హ్యూమర్ తో ఆకట్టుకుంటోంది. ఇందులో హీరోయిన్‌గా నటించిన నయనతారతో ఆయన కెమిస్ట్రీ కొత్తదనాన్ని తీసుకొచ్చింది. ఈ పాటలోని ఎనర్జిటిక్ బీట్‌లు సంగీత దర్శకుడు భీమ్స్ సెసిరోలియో అద్భుతంగా సమకూర్చారు. ఉదిత్ నారాయణ్, శ్వేతా మోహన్ వోకల్స్ పాటకు నాస్టాల్జిక్ టచ్ ఇచ్చి అందరికీ ఒకేలా కనెక్ట్ అవుతోంది. ఈ పాటలోని క్యాచీ హుక్ స్టెప్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానులు పెద్ద ఎత్తున రీ క్రియేట్ చేస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ ఈ చిత్రంలో పూర్తి స్థాయి కీలక పాత్రలో కనిపించనుండటం సినిమా మీద అంచనాలను మరింత పెంచింది. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్‌లోని భారీ సెట్‌పై వేగంగా సాగుతోంది.

## 'మా ఇంటి బంగారం'



త్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2గా 'మా ఇంటి బంగారం'ను సగర్వంగా ప్రారంభించినట్లు అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ ఏడాది బ్యానర్ నుంచి వచ్చిన 'శుభం' సినిమా బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. 'మా ఇంటి బంగారం' సినిమాలో సమంత, దిగంత్, గుల్షన్ దేవయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సమంత, రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మాతలు. ఓ బేబి వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా ఇది. ఈ చిత్రానికి ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా... సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు. సీతా మీనన్. వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. పల్లవి సింగ్ కాస్ట్యూమర్, ఉల్లాస్ హైదర్ ప్రొడక్షన్ డిజైనర్, ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్‌చేస్తున్నారు. సన్నిహితులు, శ్రేయోభిలాషుల ఆత్మీయ కలయిక, ఆశీర్వాదాలతో సినిమా ప్రారంభమైంది. మూవీ ఫస్ట్ లుక్‌ను గమనిస్తే గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా అనిపించింది. అద్భుతమైన యాక్షన్ బ్యాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తామని ఈ సందర్భంగా మేకర్స్ తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభమైందని, మరిన్ని వివరాలను తెలిజేస్తామని మేకర్స్ పేర్కొన్నారు.

## ప్రణవ్ మోహన్ లాల్ 'డియాస్ ఇరాయ్'



మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ తనయుడిగా చిత్రసీమలో అడుగు పెట్టిన ప్రణవ్, అతి తక్కువ సమయంలో తనకంటూ ఒక స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. 'హృదయం'తో భాషలకు అతీతంగా ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించుకున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'డియాస్ ఇరాయ్'. మిస్టరీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేస్తోంది. కమల్ హాసన్ 'పుష్పక విమానం', 'నాయకుడు' నుంచి ధనుష్ 'రఘువరన్ బీటెక్' వరకు తెలుగులో శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేసిన పరభాషా సినిమాలు భారీ విజయాలు సాధించడంతో పాటు విమర్శకుల - ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. అందువల్ల, 'డియాస్ ఇరాయ్' మీద ప్రేక్షకులతో పాటు బిజినెస్ వర్గాల్లో అంచనాలు ఏర్పడ్డాయి.

## అందమైన ఫిగరు నువ్వా సాంగ్



హీరో నాగశౌర్య కంప్లీట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్ బాయ్ కార్తీక్‌లో పవర్ ఫుల్ పాత్రలో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నూతన దర్శకుడు రామ్ దేసినా (రమేష్) దర్శకత్వంలో శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. టీజర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అందమైన ఫిగరు నువ్వా సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. హారిస్ జయరాజ్ రొమాంటిక్ ఫుట్ ట్యాపింగ్ నెంబర్ గా కంపోజ్ చేశారు. కృష్ణకాంత్ ఆకట్టుకునే లిరిక్స్ రాశారు. శ్రీధర్ సేన, ప్రియా జెర్సన్ వోకల్స్ మరింత మెలోడీని యాడ్ చేశాయి. సాంగ్‌లో నాగశౌర్య, విధి కెమిస్ట్రీ అదిరిపో యింది. ఈ సాంగ్ కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ డీవోపీగా పని చేస్తు న్నారు. రామాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్ కాగ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్.

## "సంతాన ప్రాప్తిరస్తు"

### మంచి మ్యూజికల్ హిట్ అవుతుంది

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి



నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా నవంబర్ 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హైదరాబాద్ రామానాయుడు స్టూడి యోలో ఈ సినిమా నుంచి తెలుసా నీ కోసమే లిరికల్ సాంగ్ ను ప్రొడ్యూసర్ సురేష్ బాబు అతిథిగా రిలీజ్ చేశారు. "ఆయ్", "సేవ్ ది టైగర్స్" వంటి సక్సెస్ ఫుల్ ప్రాజెక్ట్స్‌కు వర్క్ చేసిన టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అరసాడ 'తెలుసా నీ కోసమే..' పాటను బ్యూటిఫుల్‌గా కం పోజ్ చేశారు. శ్రీమణి ఆకట్టు కునే లిరిక్స్ అందించగా.. అర్మాన్ మాలిక్ మనసుకు హత్తుకునే పాడారు. ఈ సాంగ్ లాంఛ్ ఈవెంట్ లో.. స్క్రీన్ ప్లే రైటర్ షేక్ దావూద్. జి. మాట్లాడుతూ - జనా భాలో భారత్ చైనాను దాటేసింది. మనది ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం. మరోవైపు ఐవీఎఫ్, ఫర్టిలిటీ సెంటర్స్ చాలా పెరిగాయి. ఎందుకు అనే పాయింట్ ను డిస్కస్ చేస్తూ ఎంటర్ టైనింగ్ వేలో రాసు కున్న స్టోరీ ఇది. "సంతాన ప్రాప్తిరస్తు" మంచి ఎంటర్ టైనింగ్ మూవీ. మీరంతా ఫ్యామిలీతో కలిసి ఎం జాయ్ చేసేలా సినిమా ఉంటుంది. ఈ చిత్రంలో మంచి వినోదం ఉంటుందని మేమం తా గట్టిగా చెప్పగలం. మా సినిమాకు మీరంతా సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాం. అన్నారు.

## 'కృష్ణ లీల' 'తిరిగొచ్చిన కాలం'



యంగ్ ట్యాలెంటెడ్ దేవన్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం'అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్ పై జ్యోత్స్న జి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ మాటలు- అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమా టైటిల్ మోషన్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెం ట్‌లో మాజీ సిబిఐ జే.డి. లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. యువతరం ఏది చేసినా ప్యాషన్ తో చేయమని చెబుతుంటాను. అలాంటి పాషన్ తో వర్క్ చేస్తున్న దేవన్‌ని చూసిన తర్వాత ఎలాగైనా ఈ అబ్బాయిని సపోర్ట్ చేయాలనిపించింది. రామానాయుడు తెలుగు సినిమాకి చేసిన సేవలు అమోఘం ఆయన మూవీ మొఘల్. చదువుకున్న రోజుల నుంచి ఆయనతో నాకు మంచి అనుబంధం ఉంది. సురేష్ బాబు ఈ ట్రైలర్‌ని లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. రైటర్ కిరణ్ కుమార్ గారు మాకు మంచి ఫ్రెండ్. ఆయన ఆలోచనలు చాలా బాగుంటాయి. ఈ సినిమా చాలా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ.. అనిల్ చాలా అద్భుతంగా ఈ స్టోరీ ని రాశారు. చాలా పాజిటివ్‌గా ఉంది. నిర్మాత జోష్ణ గారికి బెస్ట్ విషెస్. దేవన్ హీరోగా డైరెక్టర్‌గా వస్తున్నారు, చాలా పాషన్ తో తీశారు. తప్పకుండా సినిమాకి మంచి పాజిటివ్ రిజల్ట్ ఉంటుంది. ఈవెంట్‌కి వచ్చి జెడి గారికి థాంక్యూ. సినిమాకి పాజిటివ్ రిజల్ట్ ఉంటుంది. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. నిర్మాత జోష్నా మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది టీం వర్క్. మా నటీనటులు టెక్నికల్ టీం చాలా అద్భుతంగా వర్క్ చేశారు. దేవన్ చాలా అద్భుతంగా సినిమాని ముందుకు తీసుకెళ్లారు. ధన్య చాలా చక్కగా నటించారు. ఈ సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది.

## గోపీచంద్33 భారీ ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్



మాచో స్టార్ గోపీచంద్ ప్రస్తుతం తన ప్రెస్టీజియస్ హిస్టారికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గోపీచంద్33లో నటిస్తున్నారు. విజనరీ డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే నాలుగు షెడ్యూల్‌లు, 55 రోజుల షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం హీరో గోపిచంద్‌తో పాటు ప్రధాన తారాగణంపై వెంకట్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ భారీ ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాలో మెయిన్ హైలైట్‌గా నిలుస్తుంది. ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వ నుంది. ఇప్పటికే గోపిచంద్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ పోస్టర్, గ్లింప్స్ వీడియోకు అద్భుతమైన స్పందన లభించింది. యోధుడిలా కనిపించిన గోపిచంద్ తన పాత్రలోని ఇంటెన్స్ ని ప్రజెంట్ చేశారు. విభిన్నమైన కథలతో, సాంకేతిక నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సంకల్ప్ రెడ్డి, ఈ చిత్రంతో భారత చరిత్రలోని ప్రాముఖ్యమైన అధ్యాయాన్ని వెండితెరపైకి తెస్తున్నారు. అద్భుతమైన ఎమోషన్స్, విజువల్ గ్రాండ్యూర్ తో ప్రేక్షకులకు ఒక వినూత్న అనుభూతిని అందించబోతు న్నారు. గోపిచంద్ తన కెరీర్‌లో ఎన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. సౌందర్ రాజన్ కెమెరామ్యాన్ కాగా అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.

## 'ఆర్యన్' లవ్లీ మెలోడీ



విష్ణు విశాల్ మోస్ట్ ఎవైటెడ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్', ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టీజర్, ట్రైలర్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మేకర్స్ పరిచయమే సాంగ్ రిలీజ్. జిబ్రాన్ ఈ సాంగ్ ని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. సామ్రాట్ అందించిన లిరిక్స్ కట్టిపడేశాయి. జిబ్రాన్, అభి వి, భృత్త వోకల్స్ లవ్లీ ఫీల్ ని యాడ్ చేశాయి. ఈ సాంగ్ లో లీడ్ పెయిర్ జర్నీ హత్తుకునేలా వుంది. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్, అభిషేక్ జోసెఫ్ జార్జ్ సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. విష్ణు విశాల్ ఫిర్ చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయితగా పనిచేశారు. హరీష్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, గిబ్రాన్ సంగీతం, శాన్ లోకేష్ ఎడిటర్. 'ఆర్యన్' అక్టోబర్ 31న విడుదల కానుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఈ చిత్రాన్ని సుధాకర్ రెడ్డి (శ్రేష్ట్ మూవీస్) గ్రాండ్ గా విడుదల చేస్తున్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044